






# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక








సంపుటి : 3 సంచిక : 101 పేజీలు : 8

గురువారం, జూన్ 29, 2023 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati


## నేడు తొలి ఏకాదశి....



### ఈ ఒక్కటి చేస్తే చాలని చెప్పిన పురాణాలు..

ఆషాఢ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే ఏకాదశిని తెలుగు ప్రజలు తొలి ఏకాదశి పర్వదినంగా జరుపుకుంటారు. తెలుగు క్యాలెండరులో తొలి ఏకాదశి తర్వాత నుంచి పండుగలు ప్రారంభమవుతాయి. ఈ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకారాలు జరుగుతాయి. ఈ రోజు నుంచే చాతుర్మాస దీక్షలు ప్రారంభమవుతాయి. వైకుంతంలో మహావిష్ణువు ఈ ఏకాదశి రోజునే యోగ నిద్రలోకి వెళతారు. అందువల్ల శయన ఏకాదశిగా కూడా పిలుస్తారు.

తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షను ఆచరించి మరుసటి రోజు ద్వాదశి నాడు భోజనం స్వీకరిస్తారు. ఇలా చేయడం వలన సకల పాపాలు హరిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. తొలి ఏకాదశి రోజు యోగ నిద్రలోకి వెళ్లిన మహావిష్ణువు 4 నెలలు తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశి రోజున నిద్రలేస్తారు. స్వామీజీలు, పీఠాధిపతులు ఎక్కడికక్కడే చాతుర్మాస దీక్షలు ఆచరిస్తారు. తొలి ఏకాదశి ప్రత్యేకం పేలపిండి నైవేద్యం.

### కంటి పరీక్షల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానిది...

# ఆల్ టైం రికార్డ్

హైదరాబాద్: సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటారు.. అంతటి ముఖ్యమైన కళ్లు సరిగ్గా కనిపించకపోవడం వల్ల ఎంతో మంది ఇబ్బంది పడుతుంటారని మంత్రి హరీశ్ రావు ) అన్నారు. స్కూల్‌కు వెళ్లే విద్యార్థి నుంచి, పండుముసలి వరకు కంటి సమస్యలతో బాధపడుతుంటారని చెప్పారు. చిన్న సమస్యే కదా అని వదిలేస్తూ.. కాలం గడుపుతుంటారని, చివరకు అది పెద్ద సమస్యకు దారి తీస్తుందన్నారు. దీన్ని దృష్టిలోఉంచుకొని సీఎం కేసీఆర్ కంటివెలుగు అనే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, విజయవంతంగా అమలు చేశారని వెల్లడించారు. హైదరాబాద్‌లోని సరోజినీదేవి కంటి దవాఖానలో ఫ్యాకో మెషీన్లను మంత్రి మహమూద్ అలీతో కలిసి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కాటరాక్ట్ సర్జరీల నిర్వహణలో ఈ అత్యాధునిక యంత్రాలు ఎంతో సహాయం చేస్తాయని తెలిపారు. అల్ట్రాసౌండ్ పరిజ్ఞానంతో పనిచేసే వీటి ద్వారా సర్జరీలు సులభంగా, వేగంగా చేసేందుకు అవకాశం లభిస్తుందని, సర్జరీ తర్వాత రోగులు కూడా తొందరగా కోలుకుంటారని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12 ఫ్యాకో యంత్రాలను ఏర్పాటు చేశామని, వీటన్నింటినీ ఇప్పుడు ఒకేసారి ప్రారంభించుకున్నామని వెల్లడించారు. సరోజినీదేవి కంటి ఆసుపత్రిలో కూడా రెండు మెషిన్లు ఏర్పాటు చేశామన్నారు. మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో, మహబూబ్‌గర్, వరంగల్, నిజామాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్, కరీంనగర్, వికారాబాద్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలో ఒక్కో యంత్రం అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఒక్కో ఫ్యాకో యంత్రం ఖరీదు రూ.28.85 లక్షలు




అనీ, మొత్తంగా 12 యంత్రాలకు కలిపి ప్రభుత్వం రూ.3.46 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు.

ప్రైవేటులో రూ.30 నుంచి రూ.40 వేలు అయ్యే సర్జరీ పేదలకు ఉచితంగా అందనుంది. సర్జరీ నిర్వహించడానికి వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి సమస్యలు గుర్తించిన వారికి ఈ ఫ్యాకో మిషన్ల ద్వారా అవసరమైన చికిత్స అందనుంది. అంధత్వ రహిత తెలంగాణ సాధన కోసం ప్రారంభించిన కంటి వెలుగు.. రెండు దఫాల్లో విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఎవరూ అడగకముందే, ఇంటి పెద్దకొడుకుగా ఆలోచించిన కేసీఆర్ ప్రజల కంటి సమస్యలను దూరం చేసేందుకు ఈగొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 'గ్రామాలకు వైద్య సిబ్బంది వచ్చి.. ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అద్దాలు అందించే కార్యక్రమం ప్రపంచంలో తెలంగాణలో మినహా మరెక్కడా లేదు.

## చంద్రశేఖర్ ఆజాద్‌పై హత్యాయత్నం...

### కాల్పుల్లో తీవ్ర గాయాలు..



సహరాన్‌పూర్: ఆజాద్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు, కాన్షీరామ్ & భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై హత్యాయత్నం జరిగింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సహరాన్‌పూర్‌లోని దేవ్‌బంధ్ ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తులు ఆజాద్ కాన్వాయ్‌పై దాడికి పాల్పడ్డారు. కారులో వచ్చిన దుండగులు చంద్రశేఖర్ ఆజాద్ లక్ష్యంగా ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో ఒక బుల్లెట్ చంద్రశేఖర్ ఆజాద్ శరీరంలోకి దూసుకెళ్లి బయటికి వెళ్లిపోయింది. దాంతో తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. ఆజాద్ వెంట ఉన్నవాళ్లు ఆయనను వెంటనే సహరాన్‌పూర్‌లోని సీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం ఆజాద్ ఆరోగ్యం నిలకడగానే ఉందని, ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఏకాభిప్రాయంతోనే

## ఉమ్మడి పౌరస్మృతి అమలు చేయాలి : ఆప్




న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)గురించి ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తావించగా ఇప్పుడీ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఉమ్మడి పౌరస్మృతిని ముందుగా హిందువులకు వర్తింప చేయాలని విపక్షాలు పట్టుబట్టగా తాజాగా ఈ వ్యవహారంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) స్పందించింది. యూసీసీ అమలు చేసే ముందు అన్ని మతాల ప్రతినిధులు, రాజకీయ పార్టీలతో విస్తృతంగా చర్చించాలని ఆ పార్టీ స్పష్టం చేసింది. తాము యూసీసీకి మద్దతి స్తామని, అయితే దీనిపై ఏకాభిప్రాయం అవసరమని ఆప్ కార్యదర్శి సందీప్ పాఠక్ తేల్చిచెప్పారు. ఉమ్మడి పౌరస్మృతి ఉండాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 కూడా నిర్దేశిస్తోందని అన్నారు. ఎన్నికలు ముంచుకొచ్చిన ప్రతిసారీ ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ, కేంద్ర ప్రభుత్వం సున్నితమైన, వివాదాస్పద అంశాలను తెరపైకి తెస్తాయని పాఠక్ పేర్కొన్నారు. యూసీసీ అమలు పట్ల కానీ, పరిస్థితిని చక్కదిద్దడం పట్ల కానీ కాషాయ పార్టీకి ఎలాంటి ఆసక్తి లేదని ఆప్ నేత మండిపడ్డారు. గందరగోళ వాతావరణం సృష్టించి సమాజంలో చీలిక తేవడం ద్వారా ఎన్నికల్లో పోరాడవచ్చనే ఆరాటమే బీజేపీలో కనిపిస్తుందని దుయ్యబట్టారు. ఈ తొమ్మిదేండ్లలో ప్రధాని నరేంద్ర మోదీ ఏమైనా పనులు చేసి ఉంటే ఎన్నికల్లో అది కాషాయ పార్టీకి కలిసివచ్చేదని, కానీ ఆయన ఏ పనీ చేయనందునే యూసీసీ ఊతంతో ఎన్నికల్లో గట్టెక్కాలని మోదీ ప్రయత్నిస్తున్నారని అన్నారు.



### టీఎస్ఆర్టీసీ అరుణాచలం టూర్ ప్యాకేజీకి భక్తుల నుంచి విశేష స్పందన : ఎండీ సజ్జనార్

హైదరాబాద్ : జూలై 3న గురు పౌర్ణమి సందర్భంగా టీఎస్ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చిన అరుణాచలం టూర్ ప్యాకేజీకి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. అరుణాచలానికి ఇప్పటివరకు 15 ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేయగా, 13 బస్సుల్లో సీట్లన్ని పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన రెండు బస్సులకు ముందస్తు రిజర్వేషన్ ప్రస్తుతం కొనసాగుతోందని పేర్కొన్నారు. రిజర్వేషన్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే భక్తులు టికెట్లను బుకింగ్ చేసుకుంటున్నారన్నారు. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి 12, వేములవాడ నుంచి 2, మహబూబ్‌నగర్ నుంచి ఒక బస్సును అరుణాచలానికి పంపుతున్నామని వివరించారు. భక్తుల డిమాండ్ దృష్ట్యా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసేందుకు సంస్థ సిద్ధంగా ఉందని వెల్లడించారు. అరుణాచలం టూర్ ప్యాకేజీ ముందస్తు రిజర్వేషన్ కోసం టీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ www.tsrtconline.inను సంప్రదించవచ్చని సజ్జనార్ తెలిపారు.

### జూలై 12-19 మధ్యలో..

# చంద్రయాన్-3 లాంచ్



#### ఇస్రో చీఫ్ సోమనాథ్

న్యూఢిల్లీ: భారత్ చేపట్టనున్న మరో ప్రతిష్టాత్మక మూన్ మిషన్ చంద్రయాన్-3 లాంచ్‌కు సిద్ధమైనట్లు ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు. జూలై 12-19 మధ్య శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి దీనిని ప్రయోగిస్తామని బుధవారం చెప్పారు. అన్ని పరీక్షలు పూర్తయిన తర్వాత ఖచ్చితమైన తేదీని ప్రకటిస్తామని అన్నారు. 'ప్రస్తుతం చంద్రయాన్-3ను స్పేస్‌క్రాఫ్ట్‌కు పూర్తిగా అనుసంధించాం. పరీక్షలను కూడా పూర్తి చేశాం. జూలై 12 నుంచి 19 మధ్య ప్రయోగానికి అవకాశం ఉంది. అన్ని పరీక్షలు పూర్తయిన తర్వాత ఖచ్చితమైన తేదీని ప్రకటిస్తాం' అని సోమనాథ్ చెప్పారు. అయితే అన్ని పరిస్థితులు అనుకూలిస్తే జూలై 13 మధ్యాహ్నం 2.30 గంటలకు చంద్రయాన్-3 నింగిలోకి వెళ్తుందని ఇస్రో వర్గాలు వెల్లడించాయి. కాగా, చంద్రయాన్-3 మిషన్‌ను అత్యంత బరువైన రాకెట్, జియోసింక్రోనస్ లాంచ్ వెహికల్ మార్క్-III ద్వారా ప్రయోగించనున్నారు. స్వదేశీ ల్యాండర్ మాడ్యూల్, ప్రొపల్షన్ మాడ్యూల్ తోపాటు చంద్రుడిపైకి దించే రోవర్‌ను పంపుతారు.

### తెలంగాణలో మరో పెద్ద కంపెనీ పెట్టుబడి..

# ట్విటర్‌లో మంత్రి కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్: తెలంగాణలో మరో పెద్ద కంపెనీ పెట్టుబడి పెట్టబోతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ అయిన 'TCL Global' తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ముందుగా రూ.225 కోట్ల పెట్టుబడితో 'TCL Global' తన యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నది. దాంతో రాష్ట్రంలో 500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభ్యంకానున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ట్విటర్ ద్వారా వెల్లడించారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ అయిన 'TCL



Global'ను తెలంగాణ రాష్ట్రానికి ఆహ్వానిస్తుండటం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ కంపెనీ ఏర్పాటు చేయబోతున్న నూతన ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో వాషింగ్ మెషిన్‌లను ఉత్పత్తి చేయనున్నారు. భవిష్యత్తులో రిఫ్రిజిరేటర్‌లను కూడా ఉత్పత్తి చేసే ప్రణాళికతో కంపెనీ ఉన్నది' అని మంత్రి ట్విటర్‌లో పేర్కొన్నారు. 'ముందుగా 'TCL Global' సంస్థ రూ.225 కోట్లతో యూనిట్‌ను ప్రారంభించనుంది. దాంతో రాష్ట్రంలోని 500 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

# అంబేద్కర్ విగ్రహం వెంటనే ఏర్పాటు చేయాలి

## - అధికారులు చొరవతో ఏర్పాటు చేయకుంటే సంఘాల ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు చేస్తాం

## - దళిత సంఘాల నాయకులు



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ )

భారత రాజ్యాంగా నిర్మాత, ప్రపంచ మేధావి %ణతీ,, దీ=% అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం కోసం గత రెండు సంవత్సరాలుగా నర్సాపూర్ మండలం చిప్పలుతుర్తి గ్రామంలో ఇరువర్గాల మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. మంగళవారం గ్రామంలో హుటాహుటిన కొంతమంది యువకులు పంచాయతీ కార్యాలయంలో ఉన్న విగ్రహాన్ని తీసుకువచ్చి దిమెపై నిలబెటడంతో సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని అంబేద్కర్ విగ్రహాన్ని మళ్ళీ తీసుకువచ్చి గ్రామ పంచాయితీ కార్యక్రమంలో ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు సంజీవులు, కదారి నాగరాజు, పంబల భిక్షపతి, శాంతయ్య, శ్రీకాంత్, నర్సింలు, గణేష్, తదితరులు నేడు గ్రామని చేరుకొని దళితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఒకవైపు ప్రపంచ దేశాలతో దేశం రాజ్యాంగ విలువలతో ముందుకు వెళ్తుంటే ఆ రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ఏర్పాటు చేయనియకపోవడం సిగ్గుచేటుగా ఉందని మండిపడ్డారు. గత రెండు సంవత్సరాలుగా విగ్రహం తీసుకువచ్చి గ్రామంలో ఉన్నపటికీ విగ్రహ ప్రతిష్ట చేద్దాం అనేసరికి కావాలి కొంతమంది వ్యక్తులు యువకులను రెచ్చకొడుతూ గొడవలు తీయడం సరైనాధికాదన్నారు. స్థానిక సీఐ విగ్రహం దిమెపై పేటయిన తర్వాత దాని తొలగించడం ఏంటని దళిత సంఘాల నాయకులు ప్రశ్నించారు. ఇదే విషయాన్ని సంఘాల నాయకులు సిఐ ని అడగగా విగ్రహంనికి రక్షణ లేకుండా ఉంది కబ్బాటి తొలగించమని కచ్చితంగా జులై 10లోపు మళ్ళీ విగ్రహాన్ని అక్కడే ఏర్పాటు చేయడంకోసం కృషి చేస్తానని మాటిచారని అన్నారు. విగ్రామం జులై 10లోపు ఏర్పాటు చేయకుంటే కచ్చితంగా 15వరకు చూసి దళిత సంఘాలు, ప్రజా సంఘాలు అందరూ కలిసి చలో చిప్పలుతుర్తి కార్యక్రమం తీసుకొని తామే విగ్రహాన్ని ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, రాజయ్య, సురేష్, రాములు, నర్సింలు, బాలరాజు, రాజు, ప్రభాకర్, మహిళలు , తదితరులు పాల్గొన్నారు.

---

# ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగశుభాకాంక్షలు

## -గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు

నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్)

ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు ఈ పండుగ జరుపుకుంటారని, త్యాగనిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమన్నారు. బక్రీద్ పండుగ ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైన పండుగ అని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో సిరి సంపదలతో తుల తూగాలని, సుహృద్భావ వాతావరణంలో పండుగను జరుపు కోవాలని వారు ఆకాంక్షించారు. భక్తికి, త్యాగానికి బక్రీద్ ప్రతీకగా నిలుస్తున్న బక్రీద్ పండుగ.. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవించాలని మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తున్నదన్నారు గూడూరు నియోజకవర్గం ముస్లిం సోదరులు ,సోదరీమణులకు , అక్క చెల్లెమ్మలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.



---

# డబుల్ బెడ్ రూం కాలనీల్లో కనీస వసతులు కరవు దుర్గంధంతో పేదల ఇక్కట్లు

## - హవేలీ ఘనపురంలో కాంగ్రెస్ నేత మ్యాడంబాలకృష్ణ పర్యటన



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )

హవేలీ ఘనపురం డబుల్ బెడ్ రూమ్ నిర్మించిన కాలనీలో కనీసతులు కరువయ్యాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి మేడం బాలకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం నాడు ఆయన మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీని కాంగ్రెస్ నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీవాసులతో సమావేశమయ్యారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండు పడక గదుల నిర్మాణం చేపట్టిన అధికారులు ఆయా కాలనీల్లో వసతులు కల్పించడంలో పూర్తి విఫలమయ్యారని ఆరోపించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక నిరుపేదలు నివాసం ఉండలేకపోతున్నారని ఆయన వాపోయారు. ఈ విషయంలో అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ స్పందన కరువైందని మండిపడ్డారు. ఈ పరిస్థితిపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ హఫీజ్, మండల కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అక్బర్, మండల ఎస్సీ ప్రెసిడెంట్ మొండి పద్మారావు, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ సల్మాన్ జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్, బొగడ భూపతిపూర్ సంజీవ్, కోఆర్డినేటర్ నవీన్ చౌదరి, అన్వార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

---

# మంచిర్యాల జిల్లా మత్స్య సహకార సంఘం అడ్ హాక్ కమిటీ ఎన్నిక



మంచిర్యాల (ప్రశ్న న్యూస్)

మంచిర్యాల జిల్లా నూతన జిల్లా మత్స్యకార సహకార సంఘం లిమిటెడ్ రిజిస్ట్రేషన్, అడాక్ కమిటీ ఎన్నిక సర్వసభ్య సమావేశాన్ని బుధవారం స్థానిక మైనారిటీ ఫంక్షన్ హాల్లో జిల్లా మత్స్య శాఖ అధికారి జిల్లా సహకార అధికారి రవీందర్ రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ ఏర్పాటు చేసారు. జిల్లాలోని మత్స్య సహకార సంఘాలు 106 మంది సొసైటీ అధ్యక్షులు ఈ సమావేశానికి హాజరు కాగా (చేతులు ఎత్తే విధానం) తో సుమారు 85 ఓట్ల మెజారిటీతో జిల్లా చీఫ్ ప్రమోటార్ గా కాంపెల చిన్నయ్యను ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా నెన్నల హేమలత,కందుల శ్రీనివాస్,ప్రభాకర్,తూటి శ్రీనివాస్,అరుగుల వెంకటేష్, కల్లెడ నర్సయ్య,శాకపురం శంకరయ్య,తోకల్ ఓల్లేష్,సురం మల్లేష్, ఉట్నూరి నిత్యశ్రీ లు ఎనికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా గంగపుత్ర సంఘం అధ్యక్షుడు నేన్నెల నర్సయ్య, బోరె యాదగిరి తాండూర్ జడ్పీటీసీ సాలిగాం బాణయ్య, టీజీడబ్ల్యూడబ్ల్యూసీ గల్ఫ్ అధ్యక్షుడు కల్లేడ భూమయ్య, అఖిల భారత గంగపుత్ర యువజన మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గారే వినీష్, ఉపాధ్యక్షుడు కల్లేడ నరేష్ మరియు జిల్లాలోని వివిధ గంగపుత్ర సంఘాం నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.

---

# గర్ల్స్ కాలేజ్ సమస్య పరిష్కారం చేయలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ముందున్న మురికి కాలువ సమస్యను పరిష్కారం చేయాలని జిల్లా అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని అన్నారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ముందున్న కిరణ షాపుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న అమ్మాయిలు అలాగే మురికి కాలువ వాసనకు విద్యార్థులు టీచర్లు క్లాస్ రూముల్లోనే వాంతులు చేసుకుంటున్నారని మున్సిపల్ అధికారులకు కలెక్టర్ కూడా తెలియజేసిన పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు గత నాలుగు నెలలుగా జిల్లా అధికారుల ఆఫీస్ చుట్టూ తిప్పించుకుంటున్నారు కానీ కళాశాల సమస్యను పరిష్కారం చేయడం లేదని అన్నారు కళాశాల సమస్యను పరిష్కారం చేయాలని కళాశాల విద్యార్థులు వర్షంలో వెళ్లి కలెక్టర్ కూడా వినతి పత్రం అందజేసిన స్పందించ లేకపోయారు అలాగే కళాశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం వల్ల ఆ మురికి కాలువ చుట్టూ పందులు పశువులు తిరుగుకుంటూ కళాశాల లోపల వస్తున్నాయని విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారనీ మున్సిపల్ కమిషనర్ కి చెప్పినా ఏలాంటి స్పందన లేకుండా పోయింది అన్నారు అలాగే రాత్రి వేళలో కొంతమంది వ్యక్తులు కళాశాల లోపాలకు వెళ్లి డ్రింక్స్ చేస్తు అక్కడే తాగిన సీసాలను కూడా పగలగొట్టి వెళ్తున్నారని కలెక్టర్ కి కూడా చెప్పిన ఎటువంటి చర్యలు తీసుకోలేదు విద్యార్థులు ఉదయం కళాశాలకు వెళ్లగానే విద్యార్థుల కాళ్లకు కోసుకుంటున్నా పట్టించుకోకు పోవడం దుర్మార్గం అని అన్నారు కళాశాల నిర్మాణం కూడా పూర్తిగా కాకపోవడం వల్ల విద్యార్థులకు సరిపడా గదులు లేక బయట కూర్చోబెట్టి చదువు చెప్పే పరిస్థితికి దిగజారాబోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి విద్యార్థుల సమస్యలపై సమక్ష చేసి మురికి కాలువ సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు లేనియెడల రాబోయే కాలంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున జిల్లా అధికారుల ఆఫీసులను ముట్టడి చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు జగన్ జిల్లా నాయకులు భానుచందర్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



---

# టిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై మహిళా కమిషన్ స్పందన ఏది? కవితమ్మ నీ చిరునామా ఎక్కడ?

## - బిజెపి మహిళా నాయకురాలు ఎం. రాజేశ్వరి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)

అరిజన్ డైరీ సీఈవో షేజల్ ను గత మూడు నెలలుగా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అతని అనుచరులు తనను మానసికంగా, భౌతికంగా వేధిస్తున్నారని ఈ విషయంలో తనకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణా మహిళా కమిషన్ కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పోలీసులు, తెలంగాణ మహిళా కమిషన్ పట్టించుకోకపోవడం వల్ల జాతీయ మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించి ఆమె ఢిల్లీలో నిరాహార దీక్ష చేస్తే ఎమ్మెల్సీ కవిత తెలంగాణ మహిళా కమిషన్ ఎందుకు స్పందించలేదని ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించి ఎందుకు కేసు నమోదు చేయలేదని బిజెపి ఓబీసీ మోర్చా ఎంబీసీ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి ప్రశ్నించారు. బండి సంజయ్ కుమార్ ఎమ్మెల్సీ కవితపై చేసిన వ్యాఖ్యలను మీడియా వక్రీకరిస్తే సుమోటోగా స్వీకరించి నోటీసులు జారీ చేసిన మహిళా కమిషన్ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వస్తున్న ఆరోపణలను సుమోటోగా స్వీకరించి ఎందుకు కేసు నమోదు చేయడంలేదని దుయ్యబట్టారు. తెలంగాణలో పనిచేస్తున్నది మహిళా కమిషన్ కాదని అది కవితా కమిషన్ లాగా ఉందని ఎద్దేవా చేశారు. ఇతర రాష్ట్రాల్లో జరిగిన సంఘటనల పట్ల స్పందించిన ముఖ్యమంత్రి తనయ ఎమ్మెల్సీ కవిత స్వరాష్ట్రంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య జానకిపురం సర్పంచ్ నవ్య పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని డబ్బులు ఎరగా చూపి తన భర్తను లొంగదీసుకొని తనపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని మీడియా ముందుకు వచ్చి కన్నీరు పెడితే మరో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి పై సొంత కూతురు భూ కబ్జా ఆరోపణలు చేసి నిజాలను నిగ్గు తేల్చి నిరూపిస్తే ఎందుకు పార్టీ నుండి సస్పెండ్ చేయలేదని ఎలాంటి భూకబ్జా ఆరోపణలు లేకున్నా ఈటెల రాజేందర్ ని మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేసిన ముఖ్యమంత్రి జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి విషయంలో ఎందుకు స్పందించడం లేదని ఈటలకు ఒక నీతి యాదగిరి రెడ్డికి ఒకనీతి అంటూ ప్రశ్నించారు. తెలంగాణా రాష్ట్రంలో ఎవరైనా ఆడవాళ్ళ వైపు కన్నెత్తి చూస్తే కనుగుడ్లు పీకేస్తామని చెప్పినా ఎమ్మెల్సీ కవిత ముఖ్యమంత్రి కేసీఆర్ బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని శక్కర్ నగర్ కాలనీలో టిఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తమ్ముడు పదమూడేళ్ల మైనర్ బాలికపై నోట్లో గుడ్డలు కుక్కి కాళ్లు చేతులు కట్టేసి అత్యాచారం చేస్తే, నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సాజిద్ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పిస్తానని ఆశజూపి హైదరాబాదు తీసుకెళ్లి లాడ్జిలో ఒక హిందూ అమ్మాయిపై అత్యాచారం చేస్తే, కేటీఆర్ నియోజకవర్గంలోని ఒక సర్పంచ్ భర్త రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు 8 ఏళ్ల గిరిజన బాలికపై అత్యాచారం చేస్తే ఎందుకు స్పందించలేదని వారి కనుగుడ్లు ఎందుకు పీకేయ్యయలేదని తెలంగాణ మహిళలు మహిళలు కాదా అని ఇన్ని అఘాయిత్యాలు మహిళలపై జరిగితే స్పందించని కవితకు ఇతర రాష్ట్రాల్లో జరిగే అఘాయిత్యాలపై,మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో అంజి వంశీ పాల్గొన్నారు.



---

# జులై 2న జన గర్జన మహాసభను విజయవంతం చేయండి: విజయభాయి, రాజశేఖర్

జులై 2న ఖమ్మం పట్టణంలోని వైరా రోడ్డుఎస్ఆర్ గార్డెన్ వెనక ఖాళీ స్థలం నందు జరగనున్న తెలంగాణ జన గర్జన మహాసభకు ముఖ్య అతిథులుగా రాహుల్ గాంధీ, జాతీయ అధ్యక్షులు మల్లికార్జున కార్గే రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి సీఎల్పీ నాయకులు బట్టి విక్రమార్క తో పాటు అనేకమంది నాయకులు పాల్గొంటున్నారు. ఈ జనగర్జన మహాసభకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని శీనన్న అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు లక్షలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుధవారం ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అనుచరులు విజయబాయి, బోర్ర రాజశేఖర్ ఏన్కూర్ మండల కేంద్రంలోని ఠాగూర్ ఫంక్షన్ హాల్ నందు అభిమానుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... జులై 2న ఖమ్మం పట్టణంలో పొంగులేటి శ్రీనన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న తెలంగాణ జన గర్జన మహాసభకు ఏన్కూరు మండలం నుండి అధిక సంఖ్యలో పాల్గొని ఈ జనగర్జన మహాసభను విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ఈ జనగర్జన మహాసభకు అభిమానులను కార్యకర్తలను తరలించేందుకు బస్సులను ఏర్పాటు చేస్తే ముందుగా ఇస్తానన్న బస్సు డిపో మేనేజర్లు మనసిటి రోజున బస్సులు ఇవ్వనని చెప్పడం జరిగింది.

---

# జంతు వ్యర్థాలను వీధులలో పారవేయొద్దు:గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి



తార్నాక, జూన్ 28:

జంతు వ్యర్థాలను బయట పారవేయొద్దని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా తార్నాక లోని తమ క్యాంపు కార్యాలయం వద్ద బీ ఆర్ ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి తో కలిసి గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి ముస్లిం సోదరులకు కవర్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. ముస్లింలు జరుపుకునే బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో మత సామరస్యంగ జరుపుకోవాలని, జంతువుల వ్యర్థాలను కవర్లలో వేసి చెత్త సేకరణ కోసం వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందజేయాలన్నారు. ఎటువంటి వ్యర్థాలను కూడా డ్రైనేజీలలో, వీధులలో పార వేయవద్దని సూచించారు. అలాగే ముస్లిం సోదరీ సోదరులకు అందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు,బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---

# జూలై 2,3,4 తేదీలలో రాజీవ్ గాంధీ క్విజ్ కాంపిటీషన్ పోటీలు



ఉప్పల్, జూన్ 28:

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి సూచన మేరకు బుధవారం రామంతపూర్ కళాశాలలో హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ లో భాగంగా రాజీవ్ గాంధీ క్విజ్ కాంపిటీషన్ గురించి ఉప్పల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కరిపే అనిల్ కుమార్ వంజరి కళాశాల విద్యార్థులకు చెప్పడం జరిగింది. జూలై 2,3,4 తేదీ లో జరిగే పరీక్ష గురించి కళాశాల విద్యార్థులకి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా కరిపే అనిల్ కుమార్ మాట్లాడుతూ.. జూన్ 2వ తేదీన "రాజీవ్ గాంధీ యూత్ క్విజ్ కాంపిటీషన్" పోటీలు పెడుతున్నామని తెలిపారు. "రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్" కార్యక్రమానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని అన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ పోటీలో గెలుపొందే వారికి మొదటి బహుమతి లాప్టాప్, రెండవ, మూడవ బహుమతి ట్యాబ్, మొదటి స్థానంలో నిలిచే విద్యార్థిని, మహిళకు ఎలక్ట్రిక్ స్కూటీ ప్రోత్సాహక బహుమతులుగా పది స్మార్ట్ వాచీలు, పది ఇయర్ పాడ్స్, పది హార్డ్ డ్రైవ్స్, పది పవర్ బ్యాంకులు అందించడం జరుగుతుందని విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆఫీస్ బేరేర్ హరీష్ గౌడ్,జిల్లా అధ్యక్షుడు శ్రవణ్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు నిరంజన్ యాదవ్,కరిపే సంతోష్ కుమార్ వంజరి,ఉప్పల్ అసెంబ్లీ అధ్యక్షుడు అరుణ్ పాటిల్, రవి, మనోజ్, సాయి, పరమేష్, గణేష్, ప్రభాకర్,రాహుల్ తదితరులు పాల్గొనడం జరిగింది.

---

# బక్రీద్ శుభాకాంక్షలు ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి జూన్ 28:



నేడు బక్రీద్ పర్వదిన సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు మతాలకతీతంగా అందరూ కలిసి ఉండాలని ఈ పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని తెలుపుతూ సత్తుపల్లి శాసనసభ్యులు ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యబక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

---

# ఘట్కేసర్ మున్సిపాలిటీ 3వ వార్డులో విద్యుత్ ఏర్పాట్లు చేయించిన ముల్లి పావని జంగయ్య యాదవ్



ఘట్కేసర్, జూన్ 28 :

ఘట్కేసర్ మున్సిపాలిటీ 3వ వార్డులో తమ సొంత ఖర్చులతో విద్యుత్ తీగలను అందించిన స్థానిక కౌన్సిలర్ బొక్క సంగీత ప్రభాకర్ రెడ్డి వాటికి విద్యుత్ బల్బ్ లని ఏర్పాటు చేయించిన ఘట్కేసర్ మున్సిపల్ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, కమిషనర్ వేమన రెడ్డి, వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. ముందుగా స్థానిక కౌన్సిలర్ బొక్క సంగీత ప్రభాకర్ రెడ్డికి అభినందనలు తెలుపుతూ ఘట్కేసర్ మున్సిపల్ ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని వారికి రాత్రి సమయాల్లో విద్యుత్ లేక వాహనదారులకు, అదేవిధంగా పాదచారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి కోసం నూతన విద్యుత్ తిగలను,విద్యుత్ బల్బ్ లను, ఏర్పాటు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండారు ఆంజనేయులు గౌడ్, మాజీ వార్డు సభ్యులు బొక్క జంగారెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు బొక్కసుధాకర్ రెడ్డి, కట్ట నర్సింహారెడ్డి రెడ్డి,వాకిటి ప్రవీణ్ రెడ్డి,వర్క్ ఇన్స్పెక్టర్ రాకేష్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### గవర్నర్ ట్వీట్ పై...

# స్పందించిన హరీష్ రావు



హైదరాబాద్: ఉస్మానియా ఆస్పత్రి పై గవర్నర్ తమిళి సై ట్వీట్ పై మంత్రి హరీష్ రావు స్పందించారు. గవర్నర్ తమిళి సై వ్యాఖ్యలు వ్యాఖ్యలు దురదృష్టకరమని, ఉస్మానియా ఆస్పత్రి పై మొదట స్పందించింది ముఖ్యమంత్రి కెసిఆర్ అని గుర్తు చేశారు. జూలై 2015లో సిఎం కెసిఆర్ ఆసుపత్రిని సందర్శించారని, నూతన భవనం నిర్మాణానికి అప్పుడే రూ.200 కోట్లు ప్రకటించారన్నారు. ఆగస్టు 5వ తేదీన కొందరు కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారని అప్పటినుంచి న్యాయ వివాదంలో ఉందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సైతం ఆసుపత్రి నిర్వహణకు భవనం పనికిరాదని నివేదిక ఇచ్చారని, కోర్టు ఆదేశాల మేరకు ఐఐటి హైదరాబాద్ నిపుణులు, ఆర్కియాలాజికల్ డిపార్ట్ మెంట్ డైరెక్టర్ తో ఇండిపెండెంట్ కమిటీని వేశామని, వారు కూడా భవనం ఆసుపత్రి నిర్వహణకు పనికిరాదని స్పష్టం చేశారన్నారు. ప్రభుత్వం కూడా కోర్టుకు అదే విషయం చెప్పిందని, కోర్టు నుంచి సానుకూలంగా నిర్ణయం వస్తుందని భావించామన్నారు. గవర్నర్ ఈ విషయాలన్నీ పక్కన పెట్టి కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్టు, భూతద్దం పెట్టి వెతికినట్టు రాజకీయంగా బురదజల్లే వ్యాఖ్యలు చేయడం బాధాకరమైన విషయమన్నారు. ప్రపంచమే అబ్బురపడేలా రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించింది. 100 రోజుల్లో 1.62 కోట్ల మందికి పరీక్షలు చేసి, 45 లక్షల మందికి కళ్లద్దాలు పంపిణీ చేసింది. ఈ కార్యక్రమాన్ని గాని ఇందులో పాల్గొన్న సిబ్బందిని గాని అభినందించడానికి ఎందుకు ఆమెకు మనసు రాలేదని హరీష్ రావు ప్రశ్నించారు. నిమ్స్ 900 నుండి 1500 ఆస్పత్రిలో పడకల సంఖ్యను 1500కు పెంచాం. కొత్తగా 2000 పడకలతో విస్తరిస్తున్నాం. దీనిపై కనీసం ఒక ట్వీట్ కూడా చేయలేదని దుయ్యబట్టారు. కెసిఆర్ కిట్ కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ వంటి కార్యక్రమాలు అమలు చేసి, ప్రభుత్వ దవాఖానాల్లో వసతులు పెంచి మాతా శిశు మరణాలను 43 కు తగ్గించాం. ప్రభుత్వ దావఖానాల్లో డెలివరీలను 30 శాతం నుండి 70 శాతానికి పెంచాం. 2014తో పోల్చితే సీన్ రివర్స్ అయ్యింది. ఇవేమీ ఆమెకు ఎందుకు కనిపించలేదని హరీష్ రావు అడిగారు. దేశంలో 100% ఆసుపత్రి డెలివరీలు జరుగుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కేంద్రమే చెప్పిందని, అయినా ఎందుకు అభినందించరని, నేను రాను బిడ్డో సర్కారు దావఖానకు అనే స్థితి నుంచి నేను వస్తా బిడ్డ సర్కార్ దావఖానకు అనే స్థాయికి చేర్చిన విషయం ఆమెకు కనిపించడం లేదా అని హరీష్ రావు చురకలంటించారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ దేశంలోనే ఒక చరిత్ర అని, గతంలో 20 ఏళ్లకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తే సిఎం కెసిఆర్ 9 ఏళ్లలోనే 21 కాలేజీలను ఏర్పాటు చేసిన విషయంపై గవర్నర్ ఎందుకు స్పందించరని మండిపడ్డారు. లక్ష జనాభాకు 22 ఎంబిబిఎస్ సీట్లతో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నాం. ఒక డాక్టర్ గా కనీసం ఈ విషయంలోనైనా గవర్నర్ గారు అభినందించాలి కదా? ప్రశంసిస్తే తామింకా ఉత్సాహవంతంగా పనిచేస్తాం కదా? అని అడిగారు. మంచి కనబడదు, మంచి వినబడదు, మంచి మాట్లాడను అన్నట్టుగా వ్యవహరిస్తే ఎలా అని, చెడును మాత్రమే చూస్తాం, చెడు మాత్రమే వింటాం, చెడు మాత్రమే మాట్లాడతాం అన్నట్టు వ్యవహరించడం మంచిది కాదని హరీష్ రావు హితువు పలికారు. డయాలసిస్ సెంటర్లు గతంలో మూడు ఉంటే 102 కు పెంచామని, నితి ఆయోగ్ ర్యాంకింగ్లో మూడో స్థానానికి చేరామని ఇది కనిపించదా? అని ప్రశ్నించారు. గాంధీ, నిమ్స్, ఉస్మానియాలో పేదలకు ఒక్క రూపాయి ఖర్చు కాకుండా అవయవ మార్పిడి చేస్తున్నారని, వైద్యుల మనోధైర్యం పెంచేలా అభినందిస్తూ ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడరు అని దుమ్మెత్తిపోశారు. బస్తీ దవాఖానాలను నీతి అయోగ్ సైతం ప్రశంసించిందని, వీటి ఏర్పాటుతో గాంధీ ఉస్మానియా, నిమ్స్, ఫీవర్ హాస్పిటల్ వంటి పెద్ద ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గిందని, ఇది ఎందుకు కనబడదని, ఒక వైద్యురాలు అయి ఉండి.. తెలంగాణ వైద్యులు చేసిన కృషి కనిపించకపోవడం బాధాకరమైన విషయమన్నారు. రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న గవర్నర్ తమిళి సై బిజెపి తరుపున రాజకీయ విమర్శలు చేయడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల నియంత్రణపై ప్రత్యేకంగా అన్ని జిల్లాల డిఎంహెచ్ఒలతో రివ్యూ నిర్వహించామని, కలుషిత నీటి ద్వారా వచ్చే వ్యాధులు మిషన్ భగీరథ తో దాదాపు తగ్గిపోయాయన్నారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణపై ప్రధానంగా దృష్టి పెట్టాలని అన్ని జిల్లాల వైద్యాధికారులను ఆదేశించామని, ఇప్పటికే పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి ద్వారా చాలా వరకు తగ్గాయని, ఇంకా వ్యాధులు నమోదు అవుతున్న జిల్లాలో చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. మలేరియాను గుర్తించే 8 లక్షల రాపిడ్ కిట్లను ఇప్పటికే అన్ని పిహెచ్ సిలకు పంపించామని, డెంగ్యూను గుర్తించే 1.23 లక్షల ఎలిజా కిట్లను పంపిణీ చేశామని హరీష్ రావు చెప్పారు. 26 ఆస్పత్రులలో బ్లడ్ కాంపోనెంట్ మెషిన్లు అందుబాటులో ఉన్నాయని, రాష్ట్రంలో డాక్టర్ల రిజిస్ట్రేషన్ రెన్యువల్ ప్రక్రియను సులభతరం చేసేలా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పోర్టల్ ను ఆవిష్కరించామని గుర్తు చేశారు.

# పివికి భారతరత్న ఇవ్వాలి: తలసాని



హైదరాబాద్: దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావుకు కేంద్రం భారతరత్న ఇవ్వాలని తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. పివి నరసింహారావు 102వ జయంతి సందర్భంగా సర్వమత ప్రార్థనలు జరిపారు. నెక్లెస్ రోడ్డులో పివి జ్ఞానభూమి వద్ద హోంమంత్రి మహమూద్ అలీ, పివి నరసింహారావు కుమార్తె ఎంఎల్సి వాణిదేవి, ఆయన కుటుంబ సభ్యులు, మంత్రులు సత్యవతి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంఎల్ఎ శంకర్ నాయక్, ఎంఎల్ఎ ఈటెల రాజేందర్, లోక్‌సత్తా నాయకుడు జయప్రకాశ్ నారాయణ, తదితరలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా తలసాని మీడియాతో మాట్లాడారు. పివికి భారతరత్నపై ఇవ్వాలని కేంద్రంతో పోరాడుతామని, పివి చరిత్రలో నిలిచిపోతారన్నారు. దేశ రాజకీయాల్లో ఉన్న వ్యక్తులకు పివి స్ఫూర్తిదాయకమన్నారు. దేశానికి ఆర్థిక సంస్కరణలు తీసుకవచ్చి మార్గదర్శకంగా నిలిచారని తలసాని ప్రశంసించారు.

# రెండో రోజు రైతుబంధు రూ.1278 కోట్లు జమ



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రెండవ రోజు రైతుబంధు ఖాతాలకు రూ.1278.60కోట్లు జమ చేసింది. మంగళవారం నాడు రాష్ట్రంలోని 16,98,957మంది రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ నిధులు జమ అయ్యాయి. రాష్ట్రంలో 38.42 లక్షల ఎకరాలకు రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయం అందింది. సోమవారం నుంచి ప్రభుత్వం 11వ విడతగా వానాకాల పంటల సాగుకు రైతుబంధు నిధుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. రెండు రోజుల్లో మొత్తం 39,54,138మంది రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.1921.18కోట్లు జమ అయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రైతుబంధు పథకం అమలు ద్వారా తెలంగాణలో సాగు విప్లవం వచ్చిందన్నారు. సాగునీటి రాక, ఉచిత విద్యుత్ పంపిణీ వల్ల రాష్ట్రంలోని పంటల సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరా సాగులోకి వచ్చిందని తెలిపారు. వ్యవసాయరంగం చుట్టూ అల్లుకున్న రంగాలు బలోపేతం అవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ ఎంతో ముందుచూపుతో వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

## అప్పుడు నన్ను చంపేందుకు ఈటల కుట్ర: కౌశిక్ రెడ్డి



హైదరాబాద్: ఓటమి భయంతోనే బిజెపి ఎంఎల్ఎ ఈటల రాజేందర్ ఆరోపణలు చేస్తున్నారని ఎంఎల్సి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. ఈటెల రాజేందర్ కౌంటర్ కు కౌశిక్ రెడ్డి రీకౌంటర్ ఇచ్చారు. ఫ్రస్టేషన్‌లో ఈటల ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని దుయ్యబట్టారు. ఈటలను చంపాల్సిన అవసరం తనకు లేదన్నారు. ఈటల రాజేందర్ కోసం రూ.20 కోట్లు కాదుకదా? 20 రూపాయల ఖర్చు వేస్ట్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే ఈటల రాజేందర్, ఆయన భార్య జమున డ్రామాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2018లో తనని చంపించేందుకు ఈటల కుట్ర చేశారని ఆరోపణలు చేశారు. ఇటీవల తనపై రెక్కీ చేసినట్టుగా అనుమానం ఉందని, తనకు, తన కుటుంబానికి ఏం జరిగినా ఈటలదే బాధ్యత అని చెప్పారు.

# ఎన్సీపీ కీలక సమావేశం...


## పోస్టర్లలో అజిత్ పవార్ ఫొటో మాయం




న్యూఢిల్లీ: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) కీలక సమావేశానికి సంబంధించిన పోస్టర్లలో ఆ పార్టీ సీనియర్ నేత అజిత్ పవార్ ఫొటో మాయమైంది. ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, వర్కింగ్ ప్రెసిడెంట్లు సుప్రియా సూలే, ప్రఫుల్ పటేల్ మాత్రమే పార్టీ పోస్టర్లలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అజిత్ పవర్ ఫొటో పోస్టర్లలో కనిపించకపోవడంపై ఆ పార్టీలో చర్చకు దారి తీసింది. దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం ఎన్సీపీ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్లలో అజిత్ పవార్ ఫొటో ఎక్కడా కనిపించలేదు. ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలే, ప్రఫుల్ పటేల్ ఫొటోలు మాత్రమే ఆ బ్యానర్లపై ఉన్నాయి. వారిద్దరినీ ఎన్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా శరద్ పవార్ ఇటీవల నియమించారు. కుమార్తె సుప్రియా సూలేకు మహారాష్ట్ర, ప్రఫుల్ పటేల్‌కు ఇతర రాష్ట్రాల బాధ్యతలు అప్పగించారు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న అజిత్ పవార్ ఆ బాధ్యతల నుంచి తనను తప్పించాలని ఇటీవల గళమెత్తారు. తనకు పార్టీలో పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే మేనల్లుడు అజిత్ పవార్ అభ్యర్థనపై శరద్ పవార్ స్పందించారు. అలాంటి నిర్ణయం ఒక వ్యక్తి మాత్రమే తీసుకోవడం కుదరదని తెలిపారు. అజిత్ పవార్‌తో సహా పార్టీ కీలక నేతలు సమావేశమై ఆయన అభ్యర్థనపై నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. పార్టీ పదవిని చేపట్టాలన్న సెంటిమెంట్ ప్రతి ఒక్కరికి ఉంటుందని, అజిత్ పవార్ కూడా అదే సెంటిమెంట్ గురించి మాట్లాడినట్లు శరద్ పవార్ వెల్లడించారు.

# కర్నాటకలో మహిళలకు ఉచిత బస్ ఎఫెక్ట్...

## కన్నీటి పర్యంతమైన ఆటోడ్రైవర్.. వైరల్ అవుతున్న వీడియో!



బెంగళూర్ : రోజంతా పనిచేసి సంపాదించినా కుటుంబ బాధ్యతలను మోయడం ఈ రోజుల్లో భారమవుతున్నది. అలాంటిది ఓ ఆటో డ్రైవర్ ఐదు గంటలు కష్టపడితే కేవలం రూ. 40 దక్కడంతో అతడు కంటతడి పెట్టిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. ఈ వీడియోలో తాను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఎంత కష్టపడినా కేవలం 40 రూపాయలే ఆర్జించానని అతడు విలపిస్తూ చెప్పడం నెటిజన్ల గుండెలను బరువెక్కించింది. కర్నాటక ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అందుబాటులోకి తీసుకురావడంతో తమ పరిస్థితి దయనీయంగా మారిందని ఆటోడ్రైవర్ వాపోయాడు. కర్నాటక ప్రభుత్వ నిర్ణయం ప్రజలను పేదరికంలోకి నెట్టివేసిందని వీడియోకు క్యాప్షన్ ఇచ్చారు. ఈ వీడియోను నెట్టింట షేర్ చేసినప్పటి నుంచి ఏకంగా 1.25 లక్షల మంది వీక్షించగా పెద్దసంఖ్యలో నెటిజన్లు రియాక్టయ్యారు. కొందరు ఆటో డ్రైవర్‌పై సానుభూతి చూపగా, ఆటోడ్రైవర్లు గమ్యస్థానాలు ఎంచుకోవడంలో ఆచితూచి వ్యవహరించరాదని, ప్రయాణీకులను గౌరవించాలని మరికొందరు యూజర్లు కామెంట్ చేశారు.

# బీహార్ లో కూలిన మరో వంతెన...


# నెల వ్యవధిలో మూడో ఘటన



బీహార్ లో మరో వంతెన కూలిపోయింది. ఈనెల 4వ తేదీన ఖగడియా జిల్లా భగల్ పూర్ లో గంగానదిపై నిర్మిస్తున్న వంతెన కూలిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కిషన్ గంజ్ జిల్లాలో మెచ్చి నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన కూలింది. తాజాగా గంగానది పై తాత్కాలికంగా నిర్మించిన మరో వంతెన కూలిపోయింది. బీహార్ లోని వైశాలి జిల్లాలో గంగానదిపై నిర్మించిన తాత్కాలిక వంతెనలోని కొంత భాగం బుధవారం కూలిపోయింది. బలమైన గాలుల కారణంగా కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. ఆ సమయంలో వంతెన దాటుతున్న కొందరు చిక్కుకుపోయినట్లు చెప్పారు. జూన్ 20 నాటికి వంతెనను కూల్చివేయాల్సి ఉండగా.. ఇంతలోనే వంతెన కూలిపోయినట్లు చెప్పారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని తెలిపారు. కాగా నెల రోజుల వ్యవధిలోనే మూడో ఘటన కావడం గమనార్హం.

## రాహుల్ గాంధీపై అమిత్ మాలవీయ ట్వీట్...

# బీజేపీ ఐటీ సెల్ చీఫ్‌పై కేసు నమోదు



న్యూఢిల్లీ : బీజేపీ నేత, ఆ పార్టీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయపై బెంగళూర్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై చేసిన ట్వీట్‌కు సంబంధించి మాలవీయపై కేసు నమోదైంది. రాహుల్ గాంధీ ప్రమాదకరమైని, ఆయన కృత్రిమ గేమ్ ఆడుతున్నారని మాలవీయ తన ట్విట్టర్ ఖాతాలో రాసుకొచ్చారు. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు ఫిర్యాదు ఆధారంగా మాలవీయపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా అమిత్ మాలవీయపై ఎఫ్ఐఆర్ నమోదు రాజకీయ దురుద్దేశంతో జరిగిందని ఎంపీ, బీజేపీ నేత తేజస్వి సూర్య ఆరోపించారు. మాలవీయపై ఐపీసీ 153ఏ, 505(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని, ఈ రెండు సెక్షన్లు వివిధ గ్రూపుల మధ్య శత్రుత్వాన్ని ప్రేరేపించే వారిపై నమోదు చేస్తారని, అయితే రాహుల్ గాంధీ ఓ వ్యక్తి అని గ్రూపు లేదా ఓ వర్గమా..? అని ప్రశ్నించారు. అమిత్ మాలవీయపై కేసు నమోదును తాము కోర్టులో సవాల్ చేసి న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. కాగా చట్టాన్ని ఎదుర్కోవాల్సిన సందర్భంలో బీజేపీకి కేకలు వేయడం అలవాటుగా మారిందని కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే పేర్కొన్నారు. దేశ చట్టాలను అనుసరించడం వారికి సమస్యగా మారిందని ఎద్దేవా చేశారు. అమిత్ మాలవీయపై ఎఫ్ఐఆర్ నమోదు విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేవని, న్యాయ నిపుణుల అభిప్రాయం తీసుకున్న తర్వాతే ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైందని స్పష్టం చేశారు.

# దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌కు ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు: కిషన్ రెడ్డి



హైదరాబాద్: దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌కు ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు తీసుకొస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు ఉంటుందని వివరించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు సర్వేకు కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. ఒఆర్ఆర్‌పి వివరాలు తెలంగాణ ప్రభుత్వానికి అందించామని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఆర్ఆర్ఆర్, ఒఆర్ఆర్‌పితో హైదరాబాద్‌కు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుతం రీజినల్ రింగ్‌రోడ్ రూట్ అంశం కొలిక్కి వచ్చిందన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్ష మార్పు అంశం అధిష్టానం దృష్టిలో లేదని, బిజెపి రాష్ట్ర అధ్యక్ష మార్పుపై పార్టీలో చర్చలేదని, వదంతులు ఎందుకు సృష్టిస్తున్నారో తెలియడం లేదని మండిపడ్డారు. ఒకరిద్దరు పార్టీలో చేరనంత మాత్రాన నష్టం లేదన్నారు.

## సంపాదకీయం

# గుణపాఠమే కష్టకాలంలో గురువు!

జాలిపడవలసిన సందర్భంలో జాలి పడడమే ధర్మం. కష్టం వచ్చినప్పుడు, పాతచిట్టాలను విప్పి పుండు మీద కారం చల్లడం న్యాయం కాదు. "ఆ నాడే హెచ్చరించాను, విన్నావా, ఇప్పుడు ఈ స్థితి వచ్చింది చూడు..." అని సాధించడం ఏమంత మంచి సంస్కారం కాదు. ఎవరు చేసిన పనుల పర్యవసానాలు వారు అనుభవించక తప్పదన్న వేదాంతం వల్లించడం ఇంకా దుర్మార్గం. కానీ, సమస్య ఏమిటంటే, సంక్షోభం వచ్చినప్పుడు, అందులో ఉక్కిరిబిక్కిరిగా ఉంటారు కాబట్టి, హితబోధలు, ఫ్లాష్ బ్యాక్‌లు అసందర్భం అంటారు. ఏ కష్టమూ లేని కాలంలోనేమో మంచిమాటలు విననవసరం లేదన్న బేఖాతరులో ఉంటారు. మరి, దిద్దుబాటు ఎట్లా? గుణపాఠాలు ఎట్లా? భవిష్యత్ లోకి మెరుగైన ప్రయాణం ఎట్లా? "చెప్పంగ వినకపోతే చెడంగ చూడవలసివస్తుంద"ని ఒక సామెత. మరీ కటువుగా ఉన్నది కదా? పోగాలము వచ్చినవారు ఆప్తవాక్యాన్ని వినరని విష్ణుశర్మా, చిన్నయసూరీ కలిసి చెప్పారు. ఇది కూడా ఏదో శాపనార్థం పెట్టినట్టున్నది. మానవానుభవం పదే పదే ధ్రువపరుస్తూ వచ్చినా, మానవచాపల్యం మాత్రం వివేకాన్ని ఎడం పెడుతూనే వస్తోంది. అధికారం, విపరీతమైన అధికారం, ఎప్పుడూ తన ప్రాభవం శాశ్వతం అనుకుంటూ సత్యాలను ఆలకించదు. ఫలితం, కాలిన చేతులను చలువపరచడానికి మహారణ్యాలే ఆకులు రాలిన అడవులయ్యాయి. అందుకే, వీళ్లతో సంభాషించాలంటే, నొవ్వకుండా చెవులు కుట్టే విద్య ఏదో కావాలి. అభిమానశల్యాన్ని కలవరపెట్టకుండా, పూర్వాపరాల విచికిత్స ఏమైనా చేయ గలమేమో చూడాలి. ముందొక విషయం స్పష్టం చేయాలి. తప్పొప్పులతో నిమిత్తం లేకుండా, ఘర్షణలో ఉన్న ఇద్దరిలో బలహీనుల వైపున నిలబడడం ప్రాథమికంగా న్యాయం. ఈ సందర్భంలో అయితే, బలవంతుడికీ నైతికత లేదు. బలహీన పక్షానికీ నైతికత లేదు. ఇద్దరి నీతులూ కొట్టుడు పొయ్యాక, మిగిలింది బలాబలాలే. బక్కవాడి మీద బాహుబలి దౌర్జన్యం అన్యాయం కదా! పైగా ఈ మహాబలుడు తన బలాన్ని మరింత మరింత పెంచుకోవడానికి, బక్కవాళ్ల తప్పులు వెదికి వెదికి మరీ దౌర్జన్యం చేస్తూ పోతున్నాడు. కల్వకుంట్ల కవిత విషయంలో ఈడీ, సిబిఐ వగైరా కేంద్ర ఏజెన్సీలు చేస్తున్న హడావిడి, కెసిఆర్ మీద గురిపెట్టిన అస్త్రమే తప్ప మరొకటి కాదు. కవిత ఒక సులభ లక్ష్యం. అందుకు ఆమెనే అవకాశం ఇచ్చారు, నిజమే. ఒకవేళ, ఆమె జాగ్రత్త పడి ఉంటే, మరొకరెవరో లక్ష్యం అయి ఉండేవారు. తెలంగాణ రాష్ట్రంలో తనకి గట్టి ఉనికి ఏర్పడి ఉండకపోయి ఉంటే, రాష్ట్రాన్ని ఏకమొత్తంగా స్వాధీనం చేసుకోవాలనే ఆశ బిజెపికి కలిగేది కాదు. కెసిఆర్ రాజీపడితే, ఒక సయోధ్య కొనసాగేది. కెసిఆర్ రాజీ ఎరుగని మహావీరుడని చెప్పడానికి లేదు. ప్రస్తుత సంక్షోభంలో కూడా, కనీసం పుత్రికా ప్రేమతో అయినా, ఆయన ఏదో మధ్యేమార్గం కోసం ప్రయత్నించి ఉండే అవకాశం ఉంది. కానీ, రాష్ట్రమే తమ పరం కావాలన్నది బిజెపి లక్ష్యం కావడంతో, ఆ దారి మూసుకుపోయింది. ఇష్టంతోనో, లేకుండానో ఇప్పుడు కెసిఆర్ యుద్ధం చేయక తప్పదు. తాను అధికారంలో లేని ప్రతి రాష్ట్రంలోనూ బిజెపి ఏదో ఒక వ్యూహంతో అనుకూల పరిస్థితులు సృష్టించుకునే ప్రయత్నాలు చేస్తూ ఉంది. ఆ ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల నుంచి, కొన్ని చోట్ల గవర్నర్ల నుంచి సహాయసహకారాలు అందుతున్నాయి. ప్రభుత్వాలన్నాక, అధికార పార్టీలన్నాక, అనేక రాజకీయ, అభివృద్ధి ఆదాయమార్గాలుంటాయనేది కొత్త విషయం కాదు. తాజాగా దొరికితే సరే, లేకపోతే, పాతవన్నీ తవ్వితీసి, కాటికి కాళ్లు చాపి కూర్చున్న నాయకులను కూడా జైళ్లలో నెట్టడం, కోర్టులకు తిప్పడం, కేంద్రప్రభుత్వం ఒక విధానంగా సాగిస్తోంది. కక్ష పూరితంగా చేసే మాట నిజమే కానీ, ఈ తరహా కేసులలో వాస్తవం లేకుండా పోలేదు. ప్రజాస్వామిక కార్యకర్తల మీద, నిరసనకారుల మీద పెట్టే కేసులు మాత్రమే కూటసృష్టితో కూడి ఉంటున్నాయి కానీ, రాజకీయనేతల మీద కేసులు నిప్పు లేని పొగలు కావు. హజారేతో కలిసి అవినీతి ఉద్యమం చేసి తాను గద్దెనెక్కడంలో పరోక్షంగా సహకరించిన అరవింద్ కేజ్రీవాల్ మీద ఏ మాత్రం కృతజ్ఞత లేకుండా బిజెపి యుద్ధం ప్రకటించింది. ఢిల్లీ తన చేతికి రావాలన్నదే అక్కడ లక్ష్యం. లిక్కర్ కుంభకోణం అనువుగా దొరికింది. కెసిఆర్‌ను ఇబ్బంది పెట్టగల ఆయుధమూ దొరికింది. లిక్కర్ కుంభకోణంలో నిజంగా కుంభకోణం ఉందా, ఉంటే అందులో కల్వకుంట్ల కవిత నిజంగా పాలుపంచుకున్నారా వంటి ప్రశ్నలు ఎవరూ వేయడం లేదు. ఆ ప్రశ్నలకు ఏ సమాధానం వచ్చినా, ఎవరికీ పెద్దగా అభ్యంతరం ఉన్నట్టు లేదు. కవిత కూడా తన ప్రమేయం గురించిన వివరాలను ప్రస్తావించి, వాటికి ఖండనలు ఇవ్వడం లేదు. కేంద్రప్రభుత్వం రాజకీయ దురుద్దేశం మాత్రమే ఇక్కడ బోనులో ఉన్నది తప్ప, భారత రాష్ట్రసమితి నాయకులపై అవినీతి ఆరోపణలు కావు. అమిత్ షాకు స్వాగతం చెప్పిన 'వాషింగ్ పౌడర్ నిర్మా' హోర్డింగ్ ఇచ్చే సందేశం కూడా అదే. బిజెపిలో చేరితే పాపాలన్నీ ప్రక్షాళన అవుతాయి, లేకపోతే దాడులు జరుగుతాయి. అసలు పాపమో, లోపమో జరిగిందా లేదా అన్న చర్చ లేదు. కేంద్రప్రభుత్వం కనుక, బిజెపికి చెందిన అవినీతిపరులపై కూడా ఏజెన్సీల ద్వారా దర్యాప్తులు చేయించి ఉంటే, రాష్ట్రాల మీద పెత్తనం కోసం పెడమార్గాలు తొక్కకుండా ఉండి ఉంటే, దాని నైతిక శక్తి ఉన్నతంగా ఉండేది. అప్పుడు పరిస్థితి భిన్నంగా ఉండి ఉండేది.

# మూడు పార్టీల మ్యూజికల్ చెయిర్స్!



కొంచెంకొంచెంగా కాంగ్రెస్ మీద కేసీఆర్ స్వరం పెంచుతున్నారు. పోయిన అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెసే ప్రధాన ప్రత్యర్థి అయినా, అది అప్పుడు మహాకూటమి అనే మహాపరాధానికి ఒడిగట్టి, మహాఓటమిని పొందింది. ఆ తరువాత కేసీఆర్‌కు కాంగ్రెస్‌ను తిట్టే అవసరం రాలేదు. బీజేపీ ఉనికిని నెమ్మది నెమ్మదిగా రాజేస్తూ పోయారు తప్ప, కాంగ్రెస్‌ను ఖాతరు చేయలేదు. కర్ణాటక ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచాక, అది కూడా ఫలితాలు వచ్చిన రెండుమూడు రోజులకు గానీ స్పందించలేదు. 'అదో పెద్ద విషయమా!' అన్నారు మొదట, "దేశాన్ని భ్రష్టు పట్టించిందే కాంగ్రెస్, దాని మాటలను తెలంగాణలో ఎవరూ నమ్మరు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరూ కర్ణాటక ఫలితాలను పట్టించుకోవద్దు" అని ముక్తాయింపు ఇచ్చారు. మొన్న ఆదివారం నాడు నిర్మల్ సభలో మాట్లాడుతూ, కాంగ్రెస్ వస్తే ధరణిని రద్దు చేస్తారని హెచ్చరించారు. నాగర్ కర్నూల్‌లో మాట్లాడుతూ, కాంగ్రెస్ గనుక అధికారంలోకి వస్తే, ఇంతకాలం తెలంగాణ సాధించిన అభివృద్ధి అంతా నాశనం అవుతుందని అన్నారు. ప్రధాన ప్రత్యర్థి హోదాను ఎవరికి ఇవ్వాలో తానే నిర్ణయించే స్థాయిలో కేసీఆర్ ఉంటూ వచ్చారు. ఇద్దరు ప్రత్యర్థుల మధ్య కప్పల తక్కెడ నిలబెట్టి వినోదం చూశారు.

కానీ, ఇప్పుడు, ఆయన ఇవ్వడం వల్ల కాక, కాంగ్రెస్ పార్టీకి సొంతంగానే ప్రత్యర్థి హోదా సమకూరుతున్నట్టు కనిపిస్తోంది. భారతీయ జనతాపార్టీ ఎందుకనో ఈ మధ్య నీరసించిపోయింది, కేసీఆర్ కూడా దాని మీద ప్రత్యేకంగా గురిపెట్టడం లేదు. కాంగ్రెస్‌లోనే ఉంటాయనుకున్న అంతర్గత సమస్యలు, కలహాలు, ఫిర్యాదులు, బాహాటపు ధిక్కారాలు ఇప్పుడు తెలంగాణ బీజేపీలో కూడా కనిపిస్తున్నాయి. తీవ్రంగా, పట్టుదలగా ముందుకు పోవాలన్న ప్రోత్సాహం కూడా ఢిల్లీ నుంచి వారికి అందుతున్నట్టు లేదు. ప్రధాన ప్రత్యర్థిగా కాంగ్రెస్ స్థిరపడుతున్నంత మాత్రాన, కేసీఆర్ లేదా బిఆర్ఎస్ పరిస్థితి బలహీనపడిందనో, పతనోన్ముఖంగా ఉన్నదనో అనుకోవడం పొరపాటు. ఇప్పటికీ, తెలంగాణలో బిఆర్ఎస్, మళ్లీ అధికారంలోకి రాగలిగినంత బలంగానే ఉంది. కానీ, అది అట్లాగే ఉంటుందని లేదు. మునుపటి వలె సౌకర్యవంతమైన ఫలితాలు, మరింత హంగును సమకూర్చే అనంతర చేరికలు, మున్ముందు కూడా జరుగుతాయని లేదు. పరిస్థితులు మారుతున్నాయి. కేసీఆర్‌కే అవకాశాలు హెచ్చుగా ఉన్నాయి కానీ, అట్లాగని నిశ్చింతగా ఉండే పరిస్థితీ లేదు. కేసీఆర్ మాత్రమని ఏముంది, మోదీకే ఆ నిశ్చింత తగ్గిపోతోంది. భారతీయ జనతాపార్టీకి కేంద్రంలో మళ్లీ గెలవడం మాత్రమే సరిపోదు, మరింత బలంతో గెలవాలి. మరింత బలం అటుంచి, సొంతంగా మెజారిటీ రాక, ఇరవై ముప్పై సీట్లు తక్కువ పడతాయేమో అన్న భయం పట్టుకున్నది కాబట్టే, ప్రాంతీయ పార్టీల మీద మృదుమధుర వైఖరిని ప్రదర్శిస్తున్నారు. సొంతంగా గెలవలేని చోట, అక్కడ ఎందుకు అధికంగా శ్రమపడడం? శక్తియుక్తులన్నిటిని కీలకమయిన పోరాటంలో, అంటే సార్వత్రిక ఎన్నికలలో కేంద్రీకరిద్దాం అని మోదీ, షా ద్వయం అనుకుంటున్నారు. ప్రతి ప్రాంతీయ పార్టీ ఎప్పుడో ఒకప్పుడు బీజేపీతో కలిసి నడిచిందే అని దేవెగౌడ అన్నమాటలో అసత్యంలేదు. ఈ దేశంలో ప్రస్తుతానికి కాంగ్రెస్ తప్ప, మరే ప్రధాన పార్టీ కూడా బీజేపీతో పూర్తి వైరంతో లేదేమో అనిపిస్తుంది. 2024లో కాంగ్రెస్ బలం పెరగకూడదన్నది బీజేపీ రక్షణాత్మక వ్యూహం. అందుకే తెలంగాణలో తాము కాకపోతే, బిఆర్ఎస్ గెలవడాన్నే కోరుకుంటామని ఒక బీజేపీ పెద్ద నాయకుడు జనాంతికంగా అన్నది! ప్రాంతీయపార్టీలు తక్కువ పడిన సీట్లను అరువు ఇవ్వడమే కాదు, భయపెడితేనో, ప్రలోభపెడితోనో శాశ్వతంగా సభ్యులను కూడా ఇచ్చేయగలవు. అందుకని గత తొమ్మిదేళ్లుగా తామే కొరుక్కుతిన్న, విసిరిపడేసిన, దూరం పెట్టిన చిన్నపార్టీలను, ప్రాంతీయపార్టీలను బుజ్జగించే పనిలో పడ్డారు మోదీ, షా. కొత్త పార్లమెంటు ప్రారంభానికి ముందు ఆదివారం నాడు, ప్రాంతీయ మనోభావాల ప్రస్తావన తీసుకువచ్చారు మోదీ. సెంగోల్లో ప్రాంతీయ, జాతీయవాద ఉద్వేగాల మేళవింపు చూడవచ్చు. బీజేపీకే కాదు, కాంగ్రెస్‌కు కూడా బిఆర్ఎస్ ఆపద్ధర్మ బంధువే. కర్ణాటక తరువాత తెలంగాణలో బీజేపీని తుడిచిపెట్టే పని జరుగుతుందని రాహుల్ గాంధీ అమెరికాలో చేసిన ప్రకటన అనేక కనుబొమలను నాట్యం చేయించింది. తెలంగాణలో బిఆర్ఎస్‌ను కదా కాంగ్రెస్ ఓడించవలసింది అన్న సందేహం వస్తుంది, అంతర్జాతీయ వేదిక మీద తన జాతీయ అజెండా మీదనే రాహుల్ దృష్టి ఉండడం సహజమే కదా అన్న వివరణా దొరుకుతుంది. కానీ, 2024లో ప్రతిపక్షాల దశ తిరిగి, ఒక ప్రత్యామ్నాయం అవసరమైతే, కేసీఆర్ కూడా కాంగ్రెస్‌కు అవసరం అవుతారు. మరి రెండు జాతీయ పక్షాలూ, అనంతర స్నేహాల కోసం ఆశ పెట్టుకుంటే, ఎన్నికల పోరాటం ఎట్లా? కాంగ్రెస్ దృష్టి కూడా 2024 సార్వత్రిక ఎన్నికలే కాబట్టి, 2023 డిసెంబర్ ఎన్నికలు పూర్తి వైరంతో, స్పర్థతో, వైమనస్యంతోనే జరుగుతాయనుకోవాలి! బీజేపీ కూడా అదే స్పిరిట్‌తో పోటీపడుతుందా? పోటీపడి, ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చుతుందా? రెండంచెల తెలంగాణ ఎన్నికలలో చివరికి లాభపడేది ఎవరు? ఒక్క ఏడాది కాలంలోనే, ఆ మాటకు వస్తే, ఒక్క అసెంబ్లీ ఎన్నికలతోనే, దేశంలో పరిస్థితి మారుతున్నదన్న సూచన తెలిసి, రాజకీయ వాతావరణంలో ఎంతో కదలిక వచ్చింది. ఏడాది కిందట 78 శాతం భూభాగాన్ని, 69 శాతం జనసంఖ్యను పాలించిన బీజేపీ, ఇప్పుడు 43 శాతం భూభాగానికి 44 శాతం జనాభాకు మాత్రమే పరిమితమైంది. ప్రధాని అయిన నాలుగేళ్లలో 19 రాష్ట్రాలను గెలుచుకుని మోదీ ఇందిర రికార్డును అధిగమించారు. కానీ, ఇప్పుడు కేవలం 12 రాష్ట్రాలలో మాత్రమే బీజేపీ ముఖ్యమంత్రో, ఉపముఖ్యమంత్రో ఉన్నారు. మతతత్వ అంశాల మీద ప్రజల ఆసక్తి తగ్గింది, విసుగు పెరిగింది. ఆర్థిక సమస్యల మీద, అభివృద్ధి అంశాల మీద ఆలోచన కలుగుతోంది. అట్లాగే, ఉభయ తెలుగు రాష్ట్రాలలో కూడా రాష్ట్ర ప్రభుత్వాల మీద విమర్శ, విముఖత పెరిగాయి. అసంతృప్తిని రాజకీయ నిర్ణయంగా మార్చగలిగిన శక్తి రూపొందితే, ప్రజలు నిర్ణయాత్మక ఫలితాలనే అందించడానికి సిద్ధంగా ఉన్నారు. ఒక్కచాన్స్‌తోనే ప్రజలలో వ్యతిరేకతను జగన్మోహన్ రెడ్డి మూటగట్టుకున్నారు కానీ, కేసీఆర్ రెండోసారి కూడా గెలిచారు. తొమ్మిదేళ్ల పాలనకే పదేళ్ల పండుగ చేసుకుంటున్నది తన విజయాలను హోరెత్తించి, ఓటర్లను ఆకట్టుకోవడానికే.

అయితే, జరిగిన మంచితో పాటు, అనేకం చెడు కూడా ఈ తొమ్మిదేళ్లలో జరిగింది. తెలంగాణ ప్రజాసంస్కృతి, రాజకీయ సంస్కృతి అంతా మారిపోయాయి. దీనికి సంబంధించిన రాజకీయ వాదన, విమర్శ ఇంకా బలంగా రూపొందలేదు. కేసీఆర్ మీద బలమైన, ఫలితాన్నివ్వగలిగిన విమర్శను బీజేపీ రూపొందించగలిగింది. అవినీతి, కుటుంబ పాలన, మజ్లిస్ స్నేహం, వగైరా. కానీ, ఆ పార్టీకి క్షేత్రబలం లేదు. కేసీఆర్‌తో గట్టి పోరాటం చేయడానికి ఇప్పుడు కేంద్రం నుంచి అనుమతి కూడా లేదు. అవినీతి గురించి, కుటుంబ పాలన గురించి మాట్లాడగలిగే నైతిక శక్తి తెలంగాణ కాంగ్రెస్‌కు ఉన్నదా అన్నది ప్రశ్న. కర్ణాటకలో సిద్దరామయ్య నాయకత్వం, బొమ్మై ప్రభుత్వంలోని విపరీతమైన అవినీతి కాంగ్రెస్‌కు ఉపకరించాయి. ప్రాంతీయ ఉద్వేగాలను కూడా అక్కడ కాంగ్రెస్ తోడుతెచ్చుకున్నది. ఇప్పటి వరకు తెలంగాణలో కాంగ్రెస్‌కు బిఆర్ఎస్ వ్యతిరేక రాజకీయ వాదన, విమర్శ అన్నవే రూపొందలేదు. ఆశ్చర్యం ఏమిటంటే, ఇంతకాలం కష్టపడి కేసీఆర్ బీజేపీ మీద ఎటువంటి రాజకీయ దాడి చేయాలో వ్యూహ రచన చేయగలిగారు కానీ, కాంగ్రెస్ విషయంలో ఆయన నిరాయుధంగానే ఉన్నారు. 'ధరణి'కి ప్రమాదం, 70 ఏళ్ల పాలన వంటివి పనికివచ్చే ఆయుధాలు కావు. కుక్కమూతి పిందెలు, మరుగుజ్జులు వంటి శాపనార్థాలకు కూడా కాలం చెల్లింది. ఇటీవలి రెండు మూడు మీటింగుల్లో కేసీఆర్ కానీ, కేటీఆర్, హరీష్ గానీ కాంగ్రెస్ మీద చేసిన విమర్శల్లో పదునూ లేదు, విషయమూ లేదు. తెలంగాణ సాధనలో కాంగ్రెస్ పాత్ర పెద్దది. తొమ్మిదేండ్లుగా ఆ పార్టీ అధికారంలో లేదు. ఈ రెంటిని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారాస్త్రాలను రూపొందించుకోవాలి.

కాంగ్రెస్ బలపడుతూ పోతే, అదొక్కటే ఆ పార్టీకి చాలు ప్రత్యామ్నాయంగా పరిగణన పొందడానికి. దాన్ని ఎదుర్కొనడానికి మాత్రం బిఆర్ఎస్‌కు కొత్త ఆయుధాలు కావాలి. తెలంగాణలో ముక్కోణపు పోటీ జరుగుతుందా, ప్రధానంగా రెండు పక్షాల మధ్యే పోటీ ఉంటుందా అన్నది త్వరలోనే తెలిసిపోతుంది. ఇంకా ఏ కూటమిలోకి వెళ్లకుండా త్రిశంకు స్థలంలో ఉండిపోయిన రాజకీయవాదులు ఏదో ఒక ఒడ్డుకు చేరుకుంటారా, లేదా, విడి బృందంగా మసలుకుంటారా చూడాలి. ఎంతమంది ఆటగాళ్లు పెరిగితే, అంతగా వ్యతిరేక ఓటు చీలిపోతుంది. జాతీయ స్థాయిలో అయినా, రాష్ట్రాల స్థాయిలో అయినా, ఎదుటివారిని చీల్చి బలహీనపరచడం లేదా, కూడగట్టుకుని బలపడడం అన్న వ్యూహాలే రానున్న రోజులలో పోటీపడతాయి. ఇంతటి అవకాశవాద వాతావరణం మధ్య కూడా, లాభప్రలోభ వ్యూహాల మధ్య కూడా ఏదో మంచికి ప్రాణవాయువు దొరుకుతోంది.

# లక్షం 20 వేల ఓట్లు!

ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార బీఆర్ఎస్ పార్టీలో ఆందోళన పెరుగుతోంది. దీనికి తోడు కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ప్రస్తుత పరిస్థితులు, సర్వేలను పరిశీలిస్తే వచ్చే ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్‌కు పెద్ద మొత్తంలో సీట్లు చేజారే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో సంప్రదాయ, తెలంగాణవాదుల ఓటు బ్యాంకుతోపాటు ఒక్కో నియోజకవర్గంలో 15వేల నుంచి 20వేల ఓట్లు అధికంగా రాబట్టుకునేలా కార్యాచరణ చేస్తున్నట్లు సమాచారం. గతంలో గ్రేటర్ పరిధిలో అధిక సంఖ్యలో గెలిచిన సీట్లను చేజార్చుకోకుండా ఉండేందుకు అధిష్ఠానం కొత్త ఎత్తుగడలు వేసే ప్రయత్నంలో ఉంది. ఇందులో భాగంగానే గృహలక్ష్మి, డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళితబంధు, బీసీ బంధు.. తదితర పథకాల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. అలాగే నానాటికీ పెరుగుతున్న

అంతర్గత విభేదాలను పరిష్కరించే పనిలోనూ పడ్డారు. పలుమార్లు ఎమ్మెల్యేలు కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు, టికెట్ ఆశిస్తున్న ఆశావహులతో సమావేశాలు ఏర్పాటు చేసి అధిష్ఠానందే తుది నిర్ణయం అవుతుందని వెల్లడించారు. నగర శివారు ప్రాంతాలైన కొల్లూరు, ఘట్‌కేసర్‌లలో ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం చేపట్టింది. కొల్లూరులో సుమారు 16 వేల ఇళ్లు అందుబాటులోకి వచ్చాయి. ఘట్‌కేసర్‌లో కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఇదిలా ఉండగా శివారు ప్రాంతాల్లో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను గ్రేటర్ పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాలకు సమంగా కేటాయించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ విషయంపై గ్రేటర్ ఎమ్మెల్యేలతో మంత్రి కేటీఆర్ ఇప్పటికే పలుమార్లు సమావేశమయ్యారు.

# పత్తి విత్తనాల కృత్రిమ కొరత

## వ్యాపారులు, అధికారుల కుమ్మక్కు


## ఎమ్మార్పీ కంటే మూడురెట్లు ఎక్కువకు అమ్మకాలు

జూన్ 26 : రైతులను పత్తి విత్తనాల కొతర వేధిస్తోంది. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు దుక్కి చేసిన రైతులు విత్తనాలు విత్తుకుందామంటే కావాల్సిన కంపెనీల సీడ్ అందుబాటులో లేవు. నాణ్యత లేని, నకిలీ విత్తనాలు అమ్ముతున్నారు. రైతులు కోరుతున్న విత్తనాలను విత్తన వ్యాపారులు మొదలు డీలర్లు సైతం బ్లాక్ చేసి కొరత సృష్టిస్తున్నారు.

ఎక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

డిమాండ్ ఉన్న విత్తనాలను ఎమ్మార్పీ కంటే మూడు రెట్లు ఎక్కువకు విక్రయిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో పత్తి విత్తనాల కొరత రైతులను వేధిస్తోంది. విత్తనం, ఎరువులు మొదలు పండించిన పంటను విక్రయించే వరకు రైతులు అష్టకష్టాలనే ఎల్లదీస్తున్నారు. అధికారులు వ్యాపారులకు వత్తాసు పలకడంతో అడుగడుగునా కర్షకులు దోపిడీకి గురవుతున్నారు. పత్తి విత్తనాలను వ్యాపారులు బ్లాక్ చేసి కొరత సృష్టిస్తూ.. ఎమ్మార్పీ కంటే మూడింతల ఎక్కువ రేట్లకు విక్రయిస్తున్నారు. ఎక్కువ డిమాండ్ ఉన్న కంపెనీల విత్తనాల కొరత సృష్టిస్తున్నారు.

ఏ రకమైన విత్తనాలైనా ఒకటేనని వ్యవసాయాధికారులు చెబుతున్నా రైతులు మాత్రం కొన్ని కంపెనీల విత్తనాలనే ఆడుగుతున్నారు. ఈ సారి వర్షాల ఆలస్యానికి తోడు విత్తన కొరతతో రైతులు పాట్లు పడుతున్నారు. మార్కెట్‌లో పత్తికి



ధర బాగా ఉండడంతో రైతులు కాటన్ సాగుకే మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో గతేడాది 1.9లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేయగా, రైతుల ఆసక్తి నేపథ్యంలో ఈ సారి 2.5లక్షల ఎకరాల మేర వేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

# డాలర్‌పై అమెరికా గుత్తాధిపత్యం...

అంతర్జాతీయంగా రిజర్వు కరెన్సీగా డాలర్‌కి ఉన్న హోదాకి, సామ్రాజ్యవాదానికి ఉన్న సంబంధం ఏమిటి? ఈ ప్రశ్నలో రెండు భాగాలు ఉన్నాయి. అమెరికన్ సామ్రాజ్యవాదానికి డాలర్‌కి ఉన్న హోదాకి సంబంధం ఏమిటన్నది మొదటి భాగం అయితే, డాలర్ హోదాకి, మొత్తం సామ్రాజ్యవాద ఆధిపత్య వ్యవస్థకి ఉన్న సంబంధం ఏమిటన్నది రెండో భాగం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సంపదను దాచుకోడానికి డాలర్ ఒక మాధ్యమంగా ఉపయోగపడుతోంది. దానికి కారణం అంతర్జాతీయంగా ఏ దేశంలోనైనా డాలర్‌ను రిజర్వు కరెన్సీగా గుర్తిస్తారు. చరిత్రలో గతంలో ఇటువంటి హోదా బంగారానికి, కొంతవరకు వెండికి చాలా కాలం పాటు ఉండేది. బంగారంతో పోల్చితే స్థిరంగా తమ విలువను నిలబెట్టుకోగలిగిన కొన్ని కరెన్సీలు (అంటే ఆ కరెన్సీలో బంగారం ధర పెరగకుండా స్థిరంగా ఉంటుందన్నమాట) రిజర్వు కరెన్సీ పాత్ర కొంతకాలం పోషించగలిగాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కూడా బ్రెటన్‌వుడ్ వ్యవస్థలో (ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ ఆధిపత్యం ఉన్న వ్యవస్థ) ఇదే పరిస్థితి కొంతకాలం కొనసాగింది. ఐతే అధికారికంగా ప్రస్తుతం డాలర్ విలువ బంగారంతో పోల్చితే అంత స్థిరంగా లేదు. కాని ప్రపంచం లోని సంపన్నులంతా ఇప్పుడు కూడా బంగారం మీద ఎంత నమ్మకాన్ని ఉంచుతారో, డాలర్ మీద కూడా అదే నమ్మకంతో ఉంటారు. డాలర్‌తో పోల్చితే తక్కిన దేశాల కరెన్సీల విలువలు (మన రూపాయి ఒక ఉదాహరణ) పడిపోతూ వుంటాయి. కాని డాలర్ విలువ ఆ మాదిరిగా పడిపోదు. ఎందువల్ల? డాలర్ విలువ కొద్దిపాటి ఎగుడు దిగుడులకు లోనవుతుంది. కాని మొత్తంగా చూసినప్పుడు పడిపోదు. దానికి కారణం అమెరికాలో వేతనాల స్థాయి పెరగకుండా ఎప్పటికప్పుడు కిందకి తొక్కిపట్టి ఉంచుతారు. ఆ విధంగా ఉంచడానికి కావలసిన మేరకు అక్కడ నిరుద్యోగ సైన్యం తగు మోతాదులో ఉండేలా చూస్తారు. అదే విధంగా మన దేశమూ చేస్తుంది కదా? మరి మన రూపాయి విలువ మాత్రం డాలర్‌తో పోల్చితే ఎందుకు పడిపోతోంది? అమెరికా మూడో ప్రపంచ దేశాల మీద ఐఎంఎఫ్ షరతుల పేరుతోనో, రాజకీయంగా వత్తిడులు తీసుకువచ్చో ఆ దేశాలలో పండించే పంటల ధరలను, ఇతర సహజ వనరుల ధరలను తగ్గించేలా చేస్తుంది. దాని ఫలితంగా డాలర్ విలువ పడిపోకుండా నిలబడుతుంది. కాని ఆ మూడో ప్రపంచ దేశాల కరెన్సీల విలువలు డాలర్‌తో పోల్చితే పడిపోతూ వుంటాయి. ఈ విధంగా డాలర్‌ను దాదాపు బంగారంతో సమానంగా ప్రపంచం లోని కుబేరులందరూ పరిగణిస్తున్నప్పుడు అమెరికా ఎప్పటికీ తరగని ఒక బంగారపు గనిమీద ఉన్నట్టే లెక్క. తన కరెన్సీ విలువను తగ్గించకుండానే అమెరికా తన బడ్జెట్ లోటును (డాలర్లను అదనంగా ముద్రించడం ద్వారా) భర్తీ చేసుకోవచ్చు. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ప్రపంచ సంపదను కేవలం డాలర్లలోనే దాచుకోరు. యూరో, పౌండ్-స్టెర్లింగ్, యెన్ వంటి కరెన్సీలలోనూ దాచుకుంటారు. దానికి కారణం ఆ కరెన్సీల దేశాలు తమ కరెన్సీ విలువ డాలర్ తో పోల్చితే పడిపోకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటాయి (అవి కూడా సామ్రాజ్యవాద దేశాలే). మొత్తంగా డాలర్‌ను ఒక ప్రమాణంగా ఆ దేశాలు కూడా పరిగణించడంతో అమెరికా తన లోటు బడ్జెట్‌ను ఏ ఇబ్బందీ లేకుండానే భర్తీ చేసుకునే సదుపాయాన్ని పొందింది. ఐతే, ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. అసలు అమెరికాలో బడ్జెట్‌లో, అంతర్జాతీయ వాణిజ్యంలో లోటు ఎందుకు ఏర్పడుతుంది? మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ చరిత్రను పరిశీలిస్తే, ఏ దేశం అయితే పెట్టుబడిదారీ వ్యవస్థకు నాయకత్వ పాత్ర పోషిస్తుందో, ఆ దేశం తక్కిన పెట్టుబడిదారీ దేశాలకు తన దేశ మార్కెట్‌లో ప్రవేశించడానికి అవకాశం కల్పిస్తుంది. ఆ విధంగా వారి లాభాపేక్షకు వీలు కల్పిస్తుంది. అలా వీలు కల్పించడం ద్వారా తన నాయకత్వ పాత్రను నిలుపుకోగలుగుతుంది. అప్పుడు ఆ యా దేశాలనుండి పెద్ద ఎత్తున వచ్చిపడే సరుకుల కారణంగా నాయకత్వ స్థానంలో ఉండే దేశానికి వాణిజ్య లోటు ఏర్పడుతుంది. బ్రిటన్ పెట్టుబడిదారీ ప్రపంచానికి నాయకుడుగా ఉన్న కాలంలో యూరప్ ఖండంలోని తక్కిన పెట్టుబడిదారీ దేశాలతోను, అమెరికా తోను నడిపే వాణిజ్యంలో ఎప్పుడూ లోటు ఏర్పడుతూనే వుండేది. ఆ లోటును పూడ్చుకోడానికి బ్రిటన్ తన వలసలలో ఉన్న బంగారం నిల్వలను, విదేశీ మారకపు నిల్వలను కొల్లగొట్టింది. పాలనా వ్యయం పేరుతో రకరకాల రూపాలలో ఆ సంపదను కాజేసింది. దానికి తోడు, వలస దేశాలలో ఉన్న స్థానిక పరిశ్రమలను దెబ్బ తీసే విధంగా తన దేశంలోని ఉత్పత్తులను వలస దేశాలలో కుమ్మరించింది. ఇదెంతదాకా పోయిందంటే బ్రిటన్‌కు వాణిజ్యలోటు అంతా భర్తీ అయిపోవడమేగాక, మిగులు కూడా పోగైంది. ఆ మిగులును పెట్టుబడిగా యూరప్ దేశాలకు, తెల్లవారు ఎక్కడెక్కడ ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటూ వచ్చారో, ఆ ప్రాంతాలకు ఎగుమతి చేసింది. ఇప్పుడు అమెరికా అదే మోతాదులో మూడో ప్రపంచ దేశాల నుండి కొల్లగొట్టడం సాధ్యం కాదు. ఆ యా దేశాలలోని స్థానిక పరిశ్రమలను దెబ్బ తీయడమూ అదే మోతాదులో సాధ్యపడదు. అందుచేత పెద్ద స్థాయిలో వాణిజ్య లోటును కొనసాగించి ఆ లోటును భర్తీ చేయడానికి డాలర్లను అదనంగా ముద్రించడం తన వ్యూహంగా అమలు చేస్తోంది. ఈ వ్యూహం విజయవంతంగా అమలు కావాలంటే పెట్టుబడిదారీ ప్రపంచంలో డాలర్ ఆధిపత్యం కొనసాగడం చాలా కీలకం అవుతుంది.

అలా అమెరికా ఆధిపత్యం కొనసాగడం మీద అమెరికా లోపల సాగే ఆర్థిక కార్యకలాపాలు కూడా ఆధారపడి వుంటాయి. మామూలుగా ఏ దేశం అయినా తన దేశీయ డిమాండ్ ను పెంచడానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ఇప్పటి పరిస్థితులలో సాధ్యం కాదు.

# ఏపీకి కేంద్రం మరో నజరానా

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మరో నజరానా ప్రకటించింది. రూ. 9,574 కోట్ల



రుణాలు ఏపీ తీసుకునేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. విద్యుత్ రంగ సంస్కరణలను వేగవంతం చేసేందుకు రాష్ట్రాలకు ఆర్థిక ప్రోత్సాహకాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 12 రాష్ట్రాలు విద్యుత్ రంగంలో సంస్కరణలకు గాను రూ. 66,413 కోట్ల అప్పులు తీసుకునేందుకు కేంద్ర గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యుత్ రంగ సంస్కరణల కోసం 2023-24లో రూ. 1,43,332 కోట్ల రుణాలు తీసుకునేందుకు కేంద్ర పచ్చజెండా ఊపింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిమితికి మించి విద్యుత్ రంగ సంస్కరణలను వేగవంతం చేసేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. విద్యుత్ రంగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు విద్యుత్ వినియోగం ద్వారా ఆదాయం పెంచడానికి, విద్యుత్ రంగంలో సంస్కరణల అమలును వేగవంతం చేసేందుకు రాష్ట్రాలకు కేంద్ర సర్కారు ప్రోత్సాహకాలను ప్రకటించింది.

# వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం చంద్రబాబు కసరత్తు..



అమరావతి: రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కసరత్తు మొదలుపెట్టారు. అన్ని నియోజకవర్గాలకు ఇన్చార్జులను నియమించేందుకు ప్లాన్ చేస్తున్నారు. నేతల గ్రాఫ్ పై సమీక్షలు నిర్వహిస్తున్నారు. కొన్ని స్థానాల్లో నెలకొన్న ప్రతిష్టంభనకు ముగింపు పలకాలని చంద్రబాబు నిర్ణయించారు. ఓ వైపు అసెంబ్లీ ఇంచార్జులతో రెండో దఫా రివ్యూలు... మరోవైపు ఆయా స్థానాల్లో ఇంచార్జుల నియామకాన్ని చంద్రబాబు వేగవంతం చేశారు. ఇప్పటికే 43 అసెంబ్లీ ఇంచార్జులతో రెండో దఫా సమీక్షలు ముగిసాయి. ఇంచార్జుల నియామకంపై కొన్ని స్థానాల్లో నెలకొన్న ప్రతిష్టంభనకు ముగింపు పలుకుతూ నిర్ణయాలు తీసుకున్నారు. సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి కన్నా లక్ష్మీ నారాయణను ఇంచార్జిగా నియమిస్తూ కొద్ది రోజుల క్రితం నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల జీడీ నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జిగా వీఎం థామస్, పూతలపట్టుకు కలికిరి మురళీ మోహన్‌ను నియమించారు. వర్గ పోరు ఉన్న స్థానాలపై చంద్రబాబు ఫోకస్ పెట్టారు. గోపాలపురం నియోజవకర్గంలో పార్టీ నేతల మధ్య విభేదాలకు ముగింపు పలకనున్నారు. గోపాలపురం ఇంచార్జ్ వెంకటరాజు, పార్టీ నేత బాపిరాజులను వచ్చి కలవమని పిలిపిచ్చారు. మరోవైపు పార్టీలో చేరికలపైనా దృష్టి పెట్టారు. కాగా గురువారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు టీడీపీలో చేరనున్నారు. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంపై ప్రజల్లోకి వెళ్లేందుకు చంద్రబాబు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వచ్చే నెల మొదటి లేదా రెండో వారం నుంచి భవిష్యత్‌కు గ్యారెంటీపై జిల్లాల్లో చంద్రబాబు పర్యటనలకు సిద్ధమవుతున్నారు. యువగళం పాదయాత్ర ఒకవైపు.... మరోవైపు భవిష్యత్‌కు గ్యారెంటీపై చంద్రబాబు ప్రచార యాత్రలు ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# మోడీ దేశంలో గాడ్సే, విదేశాల్లో గాంధీ




న్యూఢిల్లీ : 'ప్రతి రాష్ట్రంలోని పరిస్థితి భిన్నంగా ఉంటుంది. రాష్ట్రాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా చర్చలు రాష్ట్రస్థాయిల్లో జరగాలని నిర్ణయించాం. అందుకనుగుణంగానే ఎన్నికల నిర్వహణ ఉంటుంది. రాష్ట్ర స్థాయిల్లోనే కూటములు ఏర్పాటు చేస్తాం. తమిళనాడు, బీహార్, మహారాష్ట్ర వలే ఇతర రాష్ట్రాల్లో కూడా ఎన్నికల అవగాహనలు ఉంటాయి' అని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. శని, ఆదివారాల్లో సిపిఎం కేంద్ర కార్యాలయంలో పార్టీ పొలిట్ బ్యూరో సమావేశం జరిగింది. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పొలిట్ బ్యూరో సమావేశం తీసుకున్న నిర్ణయాలను సీతారాం ఏచూరి వివరించారు. పాట్నాలో జరిగిన సమావేశంలో ప్రతిపక్షాలన్నీ కలిసి పని చేయాలని నిర్ణయించామన్నారు. సిమ్లాలో జరిగే ప్రతిపక్షాల సమావేశానికి మరిన్ని పార్టీలు చేరతాయన్నారు. రాజ్యాంగ హక్కులపై మోడీ ప్రభుత్వం దాడి చేస్తుందని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ, విద్వేష, టెర్రర్ రాజకీయాలను వ్యతిరేకించడం, ప్రజాస్వామ్య హక్కులు, మానవ హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉమ్మడి ప్రచారోద్యమం నిర్వహించాలని ఆ సమావేశంలో నిర్ణయించామన్నారు. దేశంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో భారీ బహిరంగ సభలను ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించామన్నారు. ప్రజా జీవనోపాధి సమస్యలైన అంతులేని నిరుద్యోగం, ధరలు పెరుగుదలతో ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. గత రెండేళ్లలో ఒక శాతం కార్పొరేట్ల వద్ద 40 శాతానికి పైబడి సంపద కేంద్రీకృతమైందని, అట్టడుగున ఉన్న 50 శాతం మంది ప్రజల వద్ద కేవలం మూడు శాతం సంపద మాత్రమే ఉందని, ఆ రకంగా ఆర్థిక అసమానతలు పెరిగాయని తెలిపారు. ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారని, పేదలు మరింత పేదలుగా మారుతున్నారని అన్నారు. ఈ సమస్యలపై ప్రతిపక్షాలన్నీ ఉమ్మడిగా ఉద్యమించాల్సిన అవసరముందన్నారు.

# అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఖండిద్దాం!



ప్యాంగాంగ్ : అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఉత్తర కొరియా ప్రజలు తీవ్రంగా ఖండించారు. యుద్ధానికి ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిన బూనారు. ఆదివారం దాదాపు లక్షా 20వేల మంది ప్రజలు ప్యాంగాంగ్ వీధుల్లోకి వచ్చారు. కొరియా యుద్ధం ప్రారంభమై 73ఏళ్లు అయిన సందర్భంగా వారు భారీగా ప్రదర్శనలు నిర్వహించారని స్థానిక మీడియా సోమవారం తెలిపింది. ప్రదర్శనల్లో పాల్గొన్న వారిలో ప్రధానంగా కార్మికులు, యువత, విద్యార్థులే వున్నారు. రాజధానిలోని మే డే స్టేడియం వద్ద, నగరంలోని వివిధ ప్రాంతాల్లో వీరు ప్రదర్శనలు నిర్వహించారని ప్రభుత్వ మీడియా సంస్థ కెసిఎన్‌ఎ తెలిపింది. ఉత్తర కొరియాను సమూలంగా తుడిచిపెట్టేందుకు అమెరికా సామ్రాజ్యవాదులు చేపట్టిన యుద్ధానికి ప్రతీకారం తీర్చుకుంటామని వారు ప్రతినబూనారని మీడియా పేర్కొంది. లక్షా 14వేలుమంది పట్టే సామర్థ్యం కలిగిన స్టేడియం లోపల గల జనసందోహం ఫోటోలను ప్రభుత్వ మీడియా ప్రచురించింది. 'యావత్ అమెరికా భూభాగం మా కాల్పుల పరిధిలోనే వుంది.', ''సామ్రాజ్యవాద అమెరికా శాంతి విధ్వంసకర్త' అని రాసి వున్న ప్లకార్డులను ప్రదర్శకులు చేబూనడం కనిపించింది. ఉత్తర కొరియా ప్రముఖులు పలువురు ఈ ర్యాలీలకు హాజరయ్యారు. సైనిక ఘర్షణ వైపు, అణ్వాయుధ విన్యాసాల మైపు అమెరికా మొగ్గిందంటూ పేరు వెల్లడించని ఒక వక్త వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితి అమెరకా దూకుడు స్వభావాన్ని వెల్లడిస్తోందని, తరాలు మారినా ఈ తీరు మారదని ఆయన విమర్శించారు. కొరియా ద్వీపకల్పాన్ని ఏకం చేయాలనే ప్రయత్నంలో ఉత్తర కొరియా, దక్షిణ కొరియాపై దండెత్తినప్పుడు 1950 జూన్ 25న కొరియా యుద్ధం ఆరంభమైంది.

# శాసనసభ ఎన్నికల్లో కన్జర్వేటివ్ న్యూడెమోక్రసీ పార్టీ విజయం



ఏథెన్స్ : గ్రీస్‌లో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కన్జర్వేటివ్ న్యూ డెమోక్రసీ పార్టీ విజయం సాధించింది. మెజార్టీ సీట్లను సాధించి మరోసారి అధికారంలోకి రానుంది. మే 21 జరిగిన ఎన్నికల పోలింగ్ జరిగింది. కాగా, వీటి ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి. ఈ ఎన్నికల ఫలితాల్లో కన్జర్వేటివ్ న్యూడెమోక్రసీ పార్టీకి చెందిన ఆ దేశ ప్రధాని కైరియోకాస్ మిటోటాకిస్ 40.56 శాతం ఓట్లను సంపాదించి మరో నాలుగేళ్లపాటు తన పార్టీని అధికారంలోకి తెచ్చుకున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన ప్రత్యర్థి వామపక్ష సిరిజా పార్టీకి చెందిన అలెక్సిస్ సిప్రస్ 17.83 శాతం ఓట్లను సాధించి రెండో స్థానంలో నిలిచారు. 300 సీట్లున్న పార్లమెంటులో 151 స్థానాలు సీట్లు గెలిస్తే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. తాజా ఎన్నికల్లో కన్జర్వేటివ్ న్యూడెమోక్రసీ పార్టీ 158 స్థానాలను గెలిచింది. దీంతో ఆదేశంలో ఉన్న ప్రతిపక్షాలకు, కన్జర్వేటివ్ న్యూడెమోక్రసీ పార్టీ 41 శాతం ఓట్ల తేడాతో భారీ మెజార్టీని సాధించడంతో మిటోటాకిస్ రెండోసారి ప్రధాన బాధ్యతను స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా మిటోటాకిస్ మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రజలు మాకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేలా సురక్షిత మెజారిటీని అందించారు. ఇకపై ప్రజలకు ఉపయోగపడే ప్రధాన సంస్కరణలు త్వరగా అమలు చేస్తాము' అని ఆయన అన్నారు. కాగా, కైరియోకాస్ మిటోటాకిస్ ఎన్నికల ప్రచారంలో దేశ ఆర్థిక వృద్ధి, రాజకీయంగా దృష్టి సారించడంతో భారీ మెజార్టీని సొంతం చేసుకున్నారని మీడియా వర్గాలు పేర్కొన్నాయి.

# 'వాగ్నర్' చీఫ్ ప్రిగోజిన్ ప్రాణాలకు ముప్పు




వాషింగ్టన్ : రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌పై తిరుగుబాటు జెండా ఎగురవేసిన ప్రైవేట్ సైన్యం 'వాగ్నర్' చీఫ్ ప్రిగోజిన్ ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని అమెరికా నిఘా సంస్థ సీఐఏ అధిపతి డేవిడ్ పేట్రాయస్ హెచ్చరించారు. తెరిచి ఉన్న కిటికీల వద్ద చాలా అప్రమత్తంగా ఉండాలని ప్రిగోజిన్‌కు సూచించారు. గతంలో పుతిన్ ప్రత్యర్థులు చాలామంది ఇలా తెరిచి ఉన్న కిటికీల నుంచి జారిపడి మరణించారని పేట్రాయస్ పరోక్షంగా తెలియజేశారు. తిరుగుబాటు చర్య నుంచి వెనక్కి తగ్గడం ద్వారా ప్రిగోజిన్ ప్రస్తుతానికి ప్రాణాలు కాపాడుకున్నాడని, కానీ వాగ్నర్ గ్రూప్‌ను పోగొట్టుకున్నాడని అభిప్రాయపడ్డారు.

# తిరుగుబాటు వెనక అమెరికా!




మాస్కో : విఫలమైన తిరుగుబాటు వెనుక అమెరికా పాత్ర ఉందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ చెప్పారు. తనతో విభేదించే దేశాల ప్రభుత్వాలను మార్చేందుకు అమెరికా పన్నని కుట్ర లేదు. తన ప్రపంచాధిపత్యానికి అడ్డంకిగా ఉన్న ప్రభుత్వాలను కూలదోసి, తన ప్రయోజనాలను నెరవేర్చే తొత్తు ప్రభుత్వాలను నెలకొల్పేందుకు అది ఎప్పుడూ కుతంత్రాలు పన్నుతూనే ఉంటుందని సోమవారం ఆర్‌టి చానెల్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. తిరుగుబాటును భగం చేసి దేశంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు పుతిన్ చేస్తున్న యత్నాలకు చైనా తన పూర్తి మద్దతు ప్రకటించింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆదివారం తన వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసిన ప్రకటనలో రష్యాలో తాజా పరిణామాలపై అధికారికంగా తన వైఖరిని వెల్లడిం చింది. రష్యాలో తిరుగుబాటు యత్నం ఆ దేశ ఆంతరంగిక వ్యవహారమని, అయితే, పొరుగున ఉన్న మిత్ర దేశంగా, కొత్త శకంలో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం కలిగి ఉన్న దేశంగా తాము రష్యా సుస్థిరత, అభివృద్ధిని పరిరక్షించేందుకు చేస్తున్న యత్నాలకు పూర్తి మద్దతు ఇస్తున్నామని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి పేర్కొన్నారు. రష్యాలో వాగర్ తిరుగుబాటు యత్నాన్ని ఉపయోగించుకో వడంలో ఉక్రెయిన్ విఫలమైందని అమెరికన్ పత్రిక న్యూయార్క్ టైమ్స్ ఆక్రోశం వెళ్లగక్కింది. ఉక్రెయిన్‌లో రష్యన్ బలగాలను వెనక్కి తరిమేందుకు వచ్చిన ఒక అవకాశాన్ని అది చేతులారా జారవిడుచుకుందని టైమ్స్ పేర్కొంది. తిరుగుబాటు సమయంలో సైతం రష్యన్ బాలగాలు ఉక్రెయిన్‌లోని వివిధ లక్ష్యాలపై క్షిపణి దాడులను సాగించిందని తెలిపింది. తన ప్రపంచాధిపత్యానికి అడ్డంకిగా ఉన్న ప్రభుత్వాలను కూలదోసి, తన ప్రయోజనాలను నెరవేర్చే తొత్తు ప్రభుత్వాలను నెలకొల్పేందుకు అది ఎప్పుడూ కుతంత్రాలు పన్నుతూనే ఉంటుందని సోమవారం ఆర్‌టి చానెల్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. తిరుగుబాటును భగం చేసి దేశంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు పుతిన్ చేస్తున్న యత్నాలకు చైనా తన పూర్తి మద్దతు ప్రకటించింది.

## క్యాబేజీతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలో..?



ఈ రోజుల్లో మారుతున్న జీవన శైలి కారణంగా చాలా ఈజీగా వ్యాధుల బారిన పడుతున్నాము. ఆరోగ్యంగా వుండాలంటే ఖచ్చితంగా కొన్ని ఆరోగ్యకరమైన టిప్స్ పాటించాలి. పచ్చని ఆకు కూరలు ఎల్లప్పుడూ కూడా ఆరోగ్యానికి చాలా రకాలుగా మేలు చేస్తాయి. క్యాబేజీ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇది ఆరోగ్యానికి చాలా రకాలుగా మేలు చేస్తుంది. దీన్ని తినడం వల్ల మీ శరీరానికి విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, ఫైటోన్యూట్రియెంట్లు లభిస్తాయి. ఇంకా అలాగే ఇందులో ఉండే యాంటీ-ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తాయి. డయాబెటిస్ కంట్రోల్ లో ఉంటుంది, మీకు డయాబెటిస్ సమస్య ఉన్నట్లయితే ,గ్లూకోజ్ స్పైక్ భయం ఉంటే, క్యాబేజీని రెగ్యులర్ డైట్‌లో తినడం అలవాటు చేసుకోండి. ఎందుకంటే ఈ కూరగాయలలో యాంటీహైపెర్గ్లైసీమిక్ ప్రభావాలు ఉన్నాయి. ఇవి చక్కెరను ఈజీగా తట్టుకోగలవు. ఇంకా అలాగే ఇన్సులిన్ స్థాయిలను కూడా పెంచుతాయి. ఇక మారుతున్న సీజన్‌లో, ఇన్‌ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఎక్కువగా పెరుగుతుంది, దీని వల్ల జలుబు-దగ్గు, జలుబు, వంటి చాలా వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అలాంటి పరిస్థితిలో, మీరు మీ రెగ్యులర్ డైట్‌లో క్యాబేజీని చేర్చుకోవాలి. అందువల్ల మీ రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ప్రస్తుత కాలంలో అధిక బరువు పెద్ద సమస్యగా మారింది, దానిని నివారించడానికి మనం ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి.

## కిడ్నీ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు?



మన శరీరంలో కిడ్నీ అనేది చాలా ముఖ్యమైన అవయవం. ఇది మన శరీరంలోని విష పదార్థాలను వడపట్టి మూత్ర విసర్జన ద్వారా వాటిని చాలా ఈజీగా బయటకు పంపిస్తుంది. ఇంకా అలాగే అనేక రకాల వ్యాధుల నుంచి కూడా శరీరాన్ని కాపాడుతుంది. అందుకే ఈ కిడ్నీ వ్యాధులను 'సైలెంట్ కిల్లర్స్' అంటారు. ఎందుకంటే.. అసలు వీటి ప్రారంభ లక్షణాలు అసలు కనిపించవు. అందుకే కిడ్నీల విషయంలో ఖచ్చితంగా చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే వ్యాధి నియంత్రణ చాలా చాలా కష్టతరం అవుతుంది. ఇక కిడ్నీ ఫెయిల్యూర్ అయితే ఎలాంటి వ్యాధులు వస్తాయి ఇంకా అలాగే కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఏం చేయాలి? వంటి పూర్తి వివరాలు ఇప్పుడు మనం తెలుసుకుందాం.. రక్తహీనత సమస్య మూత్రపిండాల సమస్యల సాధారణ లక్షణం. అలాగే మడమలు, పాదాలు, మోకాళ్ల దగ్గర వాపు అనేది మూత్రపిండాల సమస్య యొక్క ప్రాథమిక లక్షణాలు. ఇంకా అలాగే ఆకలిని కోల్పోవడం, యూరియా, క్రియాటినిన్, యాసిడ్ వంటి విష పదార్థాలు శరీరంలో బాగా పేరుకుపోతాయి. ఇది ఖచ్చితంగా ఆకలి, వృషణాలను ప్రభావితం చేస్తుంది. అలాగే మూత్రపిండాలు ఆరోగ్యంగా లేకపోతే ఎడెమా సమస్య ఖచ్చితంగా వస్తుంది. కణాలలో ద్రవం చేరడం వల్ల కళ్ల చుట్టూ వాపు వచ్చే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంది. అలాగే దీనివల్ల వికారం, వాంతులు కూడా అవుతాయి.

### తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం...

# టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం



తిరుమల : కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తిరుమల కు చేరుకుంటున్నారు. నేరుగా క్యూలైన్ల ద్వారా భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తున్నారు. టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 69,143 మంది భక్తులు దర్శించుకోగా 26,145 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.38 కోట్లు వచ్చిందని వివరించారు.

**జూన్ 30 నుంచి కపిలేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు**

తిరుపతి : తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో జూన్ 30 నుంచి జూలై 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఇందుకోసం జూన్ 29న సాయంత్రం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక ఏవైనా దోషాలు జరిగినా, ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా శైవాగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

ఇందులో భాగంగా జూన్ 30న మొదటిరోజు ఉదయం ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం, సాయంత్రం కలశపూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠ నిర్వహిస్తారని ఆలయ అధికారులు వివరించారు. జూలై 1న ఉదయం గ్రంథి పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలపూజ, హోమం, జూలై 2న ఉదయం మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, పవిత్ర సమర్పణ నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 6 గంటలకు పంచమూర్తులైన శ్రీ కపిలేశ్వరస్వామి, శ్రీ కామాక్షి అమ్మవారు, శ్రీ విఘ్నేశ్వరస్వామి, శ్రీ సుబ్రమణ్యస్వామి, శ్రీ చండికేశ్వరస్వామివార్లకు ఏకాంతంగా ఆస్థానం నిర్వహిస్తామని చెప్పారు.

## తేనెటీల దాడిలో 70 మందికి గాయాలు.. తప్పించుకున్న ఏపీ మంత్రి బుగ్గన



అమరావతి : ఏపీలోని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తేనెటీగల దాడి నుంచి తప్పించుకున్నారు. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం కనుమకింద కొట్టాలలో బుధవారం వివిధ అభివృద్ధి పనులను పరిశీలించేందుకు మంత్రి గ్రామానికి చేరుకున్నారు.

మంత్రి వెంట అధికారులు, అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఓ చెట్టు వద్ద నుంచి పనులను పరిశీలిస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు వీరిపై దాడి చేశాయి. ఈ దాడిలో 70 మంది వరకు గాయాలు కాగా మంత్రి బుగ్గనను అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. గాయపడ్డ వారిని సమీప ఆస్పత్రిలో వైద్యం అందించి ఇంటికి పంపించారు.

## దేశంలోనే అత్యుత్తమ దవాఖానగా శ్రీపద్మావతి

హైదరాబాద్: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్మిస్తున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ దవాఖాన దేశంలోనే అత్యుత్తమ దవాఖానగా తయారవుతున్నదని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి పేర్కొన్నారు. అలిపిరి సమీపంలో నిర్మిస్తున్న ఈ దవాఖాన పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. దవాఖాన నిర్మాణం కోసం సేకరించిన భూమిలో ఉన్న రుయా ఆసుపత్రి క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల చికిత్స వార్డును పరిశీలించి వీటిని తాతాలికంగా మరోచోటికి తరలించాలని రుయా అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్‌లో దవాఖానను ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. అనంతరం ఈవో తన కార్యాలయంలో దవాఖాన పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. జేఈవో సదాభార్గవి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఈ వెంకటేశ్వర్లు, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ లక్ష్మణమూర్తి, చిన్న పిల్లల గుండె చికిత్సల దవాఖాన ఆర్ఎంవో డాక్టర్ భరత్, ఈఈ కృష్ణారెడ్డి, రుయా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు తదితరులు పాల్గొన్నారు.



# నెయ్యి అమృతం కన్నా ఎక్కువే....?



నెయ్యిలో ఎన్నో పోషకాలు, విటమిన్లు దాగున్నాయి. అందుకే, నెయ్యి తినడం వల్ల ఆరోగ్యానికి మేలే.. అందుకే ఆరోగ్య నిపుణుల నుంచి పోషకాహార నిపుణుల వరకు తరచుగా నెయ్యి తినమని సిఫార్సు చేస్తుంటారు. ఆహారంలో నెయ్యిని ఖచ్చితంగా చేర్చుకోవాలని సూచిస్తుంటారు. ఇందులో చాలా పోషకాలున్నాయి. ఇవి దేనిలోనూ కనిపించవు. ఇదంతా బాగానే ఉంది కానీ.. అసలు ఒక రోజులో ఎంత నెయ్యి తినాలి.. ఎన్ని చెంచాలు తినాలి..? అనే ప్రశ్న అందరికీ తలెత్తుతుంటుంది. ఏ విధమైన వ్యాధి లేని వ్యక్తి రోజూ 2-3 చెంచాల నెయ్యి తినొచ్చు.. వర్కవుట్‌లు చేస్తే నెయ్యి తింటే నష్టమేమీ ఉండదు. వాకింగ్ లేదా వ్యాయామం చేయకపోతేనే నష్టం.. నెయ్యి ఎక్కువగా తినడం వల్ల గుండె ధమనులలో సమస్యలు వస్తాయి. అలాగే ఫ్యాటీ యాసిడ్స్ ఉన్నవారు నెయ్యి తినకూడదు. ఎవరికైనా గుండె, పొట్ట, ఊపిరితిత్తులకు సంబంధించిన ఏదైనా జబ్బు ఉంటే వైద్యుని సంప్రదించిన తర్వాతనే నెయ్యి తినాలి.

రోగనిరోధక శక్తిని పెంచుతుంది: నెయ్యిలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి పనిచేస్తాయి. ఏ సీజన్‌లోనైనా జలుబు, ఫ్లూ నుంచి రక్షించడంలో సహాయపడతాయి. నెయ్యిలో విటమిన్లు ఎ, డి, ఇ, కె అలాగే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్నాయి. ఇవి ఇన్ఫ్లమేటరీ-అలెర్జీ సమస్యలను తగ్గిస్తాయి. దీనితో పాటు, ఇందులో లభించే పోషకాలు వివిధ రకాల వ్యాధులకు వ్యతిరేకంగా మన రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి: జీర్ణక్రియకు నెయ్యి ఉత్తమమైనదిగా పరిగణిస్తారు. ఎందుకంటే ఇది జీర్ణవ్యవస్థను ద్రవపదార్థం చేయడానికి, మంటను తగ్గించడానికి సహాయపడుతుంది. నెయ్యి తినడం వల్ల జీర్ణవ్యవస్థలో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. శరీరంలోని పోషకాలను పెంచుతుంది. ఇది వికారం, ఉబ్బరం, మలబద్ధకం వంటి అజీర్ణ లక్షణాల నుంచి ఉపశమనం పొందడంలో కూడా సహాయపడుతుంది. జీవక్రియను పెంచుతుంది: నెయ్యి తీసుకోవడం వల్ల మీ జీవక్రియ పెరుగుతుంది. శరీరంలోని చెడు కొవ్వును తొలగిస్తుంది. ఎందుకంటే నెయ్యిలో కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి శరీరం సులభంగా గ్రహించి శరీరానికి శక్తిని ఇస్తాయి. ఇంకా బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది. నెయ్యి జ్ఞాపకశక్తిని పెంచుతుంది: నెయ్యి తింటే జ్ఞాపకశక్తి బలపడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయం తీసుకునే నైపుణ్యాలు వంటి సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుంది.

# కాళ్లు కడుక్కొని పడుకోవడం మంచిదేనా..!

ప్రస్తుతం మనం జీవిస్తున్న గజిబిజి లైఫ్‌లో రాత్రి పడుకునే సమయంలో ఆహారాన్ని లేటుగా తిని వెంటనే పడుకుంటూ ఉంటారు.. అలా చేయడం వలన ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తూ ఉంటుంది. అలాగే నిద్రలేమి సమస్యతో చాలామంది బాధపడుతూ ఉంటారు. అలాంటి సమస్యలకు చెక్ పెట్టాలంటే రాత్రి పడుకునే సమయంలో కాళ్లు కడుక్కొని పడుకోవాలి అని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు.. రోజంతా పనిచేసిన తర్వాత ఇంటికి వచ్చిన తర్వాత రాత్రి సమయంలో పడుకునే ముందు కాళ్ళను కడగడం చాలా అవసరం. కానీ అలా చాలా తక్కువ మంది చేస్తూ ఉంటారు. రోజు పడుకునే ముందు కాళ్లు కడుక్కొని పడుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు.

ప్రతిరోజు పడుకునే సమయంలో కాళ్ళను కడిగి పడుకోవడం వలన కాళ్లు దృఢత్వం పెరుగుతుంది. కాళ్ల నొప్పి, తిమ్మిర్లు కూడా తగ్గుతాయి. పడుకునే ముందు మీ పాదాలను కడుక్కోవడం వల్ల చాలా మేలు జరుగుతుంది. పాదాలలో నొప్పి ఎక్కువగా ఉంటే పాదాలను కడుక్కొని పడుకోవాలి. దీంతో మనసు ప్రశాంతంగా ఉండి మంచి నిద్ర పడుతుంది. రాత్రి పడుకునే సమయంలో పాదాలు కడుక్కోవడం చాలా ముఖ్యం. కాళ్లు కు ఎక్కువగా చెమట పట్టే వారి హైడ్రోస్ అంటారు. అటువంటి వ్యక్తి రాత్రి సమయంలో కాళ్లు కడుక్కొని పడుకోవాలి.

ఇలా చేయడం వలన మీ పాదాలలో బ్యాక్టీరియా పెరగకుండా చేస్తుంది. చల్లని లేదా గోరువెచ్చని నీటితో మీ కాళ్ళని కడుక్కోవచ్చు.. ఒక డబ్ లో నీటిని తీసుకొని దాంట్లో కొన్ని నిమ్మకాయ ముక్కలను వేసి దానిలో మీ కాళ్ళను కొద్దిసేపు ఉంచుకోవాలి. కొద్దిసేపు పాటు ఉంచిన తర్వాత మీ కాళ్ళను బయటికి తీసి తడి ఆరిన తర్వాత ఆయిల్ అప్లై చేయాలి. ఇలా చేయడం వలన మీ కాళ్లకు మంచి ఉపశమనం కలుగుతుంది. వేడిగా ఉన్న వారి పాదాలు కచ్చితంగా రాత్రి సమయంలో పడుకునే ముందు కాళ్ళను కడుక్కొని పడుకోవాలి. ఇలా చేయడం వలన ఉష్ణోగ్రత సమతుల్యంగా ఉంటుంది.




# సినిమాస్కోప్

## ఒక హిందువుగా నేను కూడా బాధపడ్డా...

# ఆదిపురుష్ డైలాగులపై కుంభకర్ణుడు..

ఆదిపురుష్ సినిమాలోని డైలాగులు, పాత్రలు ఆ సినిమా విడుదలైనప్పటి నుంచి తీవ్ర వివాదాస్పదమయ్యాయి. దాదాపు అన్ని వర్గాల వాళ్లు ఆ సినిమాలోని డైలాగులపై, ఆ సినిమాలో పాత్రలను మలిచిన తీరుపై విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా హనుమంతుడు ఇంద్రజిత్తుతో చెప్పే డైలాగులపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దాంతో తర్వాత ఆ డైలాగులను మార్చేశారు. అయితే ఆ సినిమాలో నటించిన నటుడే తాజాగా ఆదిపురుష్ డైలాగులపై విచారం వ్యక్తం చేశాడు. ఆ సినిమాలోని డైలాగులతో ఒక హిందువుగా తాను కూడా చాలా బాధపడ్డానని అన్నాడు. ఇంతకూ అతనెవరు అనుకుంటున్నారా..? అతనే లవీ పజ్ని. ఆదిపురుష్ సినిమాలో ఆయన కుంభకర్ణుడి పాత్ర పోషించాడు. సినిమాకు ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత దర్శకుడు చెప్పినట్టు చేయాల్సిందేనని, అందుకే తాను ఏమీ అనలేకపోయానని ఆయన తెలిపారు. ఆ తర్వాత కొన్ని డైలాగులను మార్చినప్పటికీ ఒక హిందువుగా తాను చాలా బాధపడ్డానని అన్నారు.






## శంకర్‌కు కమల్ హాసన్ వాచ్ గిఫ్ట్..

# ఇండియన్ 2 నయా అప్‌డేట్ ఏంటో తెలుసా..?




ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో మోస్ట్ క్రేజీయెస్ట్ కాంబినేషన్ జాబితాలో కమల్‌హాసన్ –శంకర్ పేర్లు టాప్‌లో ఉంటాయి. ఈ ఇద్దరి కాంబోలో వచ్చిన భారతీయుడు ఇండస్ట్రీ రికార్డులను తిరగరాయడమే కాదు.. ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్ ఇండియన్ 2 తెరకెక్కుతోంది. సినిమా ప్రకటించినప్పటి నుంచి నేటి వరకు ఏదో ఒక అప్‌డేట్‌తో నిత్యం వార్తల్లో నిలుస్తోంది ఇండియన్ 2. తాజాగా ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ అందించింది కమల్ హాసన్ టీం. శంకర్(%హాష్ట్రుఅష్ఠుతీ%) అండ్ కమల్ బృందం ఇండియన్ 2 రషెస్‌ను వీక్షించింది. శంకర్ నుంచి మరో బ్లాక్ బస్టర్ ఖాయమని ధీమాగా ఉన్నాడు కమల్ హాసన్. రషెస్‌తో ఇంప్రెస్ అయిన కమల్ హాసన్ డైరెక్టర్ శంకర్‌కు వాచ్‌ను బహుమతిగా ఇచ్చాడు. ఈ వాచ్ మార్కెట్ ధర రూ. 8.77 లక్షలు (సుమారు). కమల్‌హాసన్ ఖరీదైన వాచ్‌ను శంకర్ చేతికి పెడుతున్న స్టిల్ ఇప్పుడు నెట్టింట్లో ట్రెండింగ్ అవుతోంది. తాజా అప్‌డేట్‌తో ఇండియన్ 2 బిజినెస్ మరింత పెరగడం ఖాయమంటున్నారు ట్రేడ్ పండితులు.

పాన్ ఇండియా స్టోరీతో వస్తున్న ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య విలన్‌గా నటిస్తుండగా..బాబీ సింహా, సిద్ధార్థ్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, సముద్రఖని కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇండియన్ 2 చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ –రెడ్ జియాంట్ మూవీస్ పై ఉదయనిధి స్టాలిన్–సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన ఇండియన్ 2 ఫస్ట్ లుక్ పోస్టర్లు సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. శంకర్ టీం ఇండియన్ 2 చిత్రానికి సంబంధించిన కీలక సన్నివేశాలను చెన్నై , లాస్ ఏంజెల్స్, తైవాన్, సౌతాఫ్రికా ప్రాంతాల్లో చిత్రీకరించారు. ఆయా లొకేషన్లలో సాంగ్స్‌తోపాటు ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్ ను షూట్ చేశారు.

# రజినీకాంత్ జైలర్‌లో కామెడీ డోస్ ఎక్కువేనంటున్న యోగిబాబు





ఏడు పదుల వయస్సు దాటినా అభిమానుల కోసం తగ్గేదే లే అంటున్నాడు తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్. తలైవా నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి జైలర్. యాక్షన్ కామెడీ జోనర్‌లో తెరకెక్కుతోంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నుంచి ఆసక్తికర అప్‌డేట్ ఒకటి ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. రజినీకాంత్ నుంచి పూర్తిస్థాయి కామెడీ టచ్ ఉన్న సినిమా రాక చాలా కాలమే అవుతుంది. ఇప్పుడా లోటును జైలర్ భర్తీ చేస్తుందంటున్నాడు పాపులర్ కమెడియన్ యోగిబాబు. జైలర్‌లో వన్ ఆఫ్ ది కీ రోల్ చేస్తున్న యోగిబాబు సినిమా యూనిక్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని చెప్పి అభిమానులు, మూవీ లవర్స్‌లో జోష్ నింపుతున్నాడు. దర్బార్‌లో కామెడీ తక్కువగా ఉంటుంది. కానీ జైలర్‌లో ఫుల్ లెంగ్త్ కామెడీ ట్రాక్స్ ఉండబోతున్నాయి. ఇందులో సూపర్ స్టార్ రియలిస్టిక్ పర్‌ఫార్మెన్స్‌తో వినోదాన్ని పంచబోతున్నాడని చెప్పుకొచ్చాడు యోగిబాబు. మొత్తానికి చాలా రోజుల తర్వాత తలైవాలోని ఫన్ యాంగిల్‌ను చూడబోతున్నామంటూ ఆనందంలో ఎగిరిగంతేస్తున్నారు అభిమానులు. జైలర్‌లో మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్, టాలీవుడ్ యాక్టర్ సునీల్, తమన్నా, కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్, రమ్యకృష్ణ, వసంత్ రవి ఇతర నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. జైలర్ ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకుంది. జైలర్ ఆగస్టు 10న థియేటర్లలో సందడి చేయనుంది. జైలర్ నుంచి ఇప్పటికే విడుదల చేసిన మోహన్ లాల్, సునీల్, తమన్నాపోస్టర్లు సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తూ.. అంచనాలు పెంచుతున్నాయిజైలర్ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తున్నారు.

# శ్రీ లీలను తెలుగులో ఎవరు ఆపలేరా...?

ప్రతి సంవత్సరం తెలుగు సినిమాఇండస్ట్రీ లోకి ఎంతో మంది ముద్దుగుమ్మలు ఎంట్రీ ఇస్తున్నారు. అలా ఎంట్రీ ఇచ్చే వారిలో కొంత మంది మాత్రమే మంచి గుర్తింపును తెలుగు సినిమా ఇండస్ట్రీ లో సంపాదించుకొని క్రేజీ సినిమా అవకాశాలను దక్కించుకుంటున్నారు. అలా టాలీవుడ్ఇండస్ట్రీ లోకి ఎంట్రీ ఇచ్చిన అతి తక్కువ కాలంలోనే అద్భుతమైన గుర్తింపును సంపాదించుకొని వరుస క్రేజీ సినిమా అవకాశాలను దక్కించుకుంటున్న వారిలో మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ మోస్ట్ టాలెంటెడ్ నటిమని శ్రీ లీల ఒకరు.



# నటుడితో యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె వివాహం



యాక్షన్ కింగ్ అర్జున్ కి సౌత్ లో ఉన్న ఫాలోయింగ్ గురించి తెలిసిందే. కన్నడిగ అయిన అర్జున్ తమిళంలో పెద్ద స్టార్ అయ్యాడు. తర్వాత తెలుగులోను స్టార్ హీరోగా అభిమానం సంపాదించుకున్నాడు. రజనీకాంత్– చిరంజీవి తర్వాతి జనరేషన్ నటుడు అయినా వారితో సమాంతరంగా అర్జున్ స్టార్ హీరోగా నిరూపించుకున్నాడు. అర్జున్ సినిమాలకు సౌత్ అంతటా ఆదరణ ఉంది. శంకర్ దర్శకత్వంలో అతడు నటించిన జెంటిల్ మేన్– ఒకే ఒక్కడు సంచలన విజయాలు సాధించాయి. 90లలోనే అర్జున్ పాన్ ఇండియా స్టార్ గా మెప్పించాడు. అర్జున్ ఇటీవల టాలీవుడ్ లో ప్రముఖ హీరోల సినిమాల్లో సహాయ నటుడిగా విలన్ గా నటించి మెప్పించారు. అడపాదడపా నటిస్తూనే దర్శకుడిగాను సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో అర్జున్ సర్జా 'లియో'లో నటిస్తున్నాడు. దళపతి విజయ్ కి ధీటైన పాత్రలో అర్జున్ నటిస్తున్నారని సమాచారం. ఈ చిత్రం బాక్సాఫీస్ పరంగా ఖచ్చితంగా బ్లాక్ బస్టర్ గా మారడం ఖాయమన్న అంచనాలున్నాయి. ఇది అర్జున్ కి కొంతగ్యాప్ తర్వాత గ్రేట్ కంబ్యాక్ అవుతుందన్న టాక్ కూడా ఉంది. అర్జున్ నటుడిగానే కాకుండా ఇంతకుముందు తన కుమార్తె ఐశ్వర్యను కథానాయికగా పరిచయం చేస్తూ అర్జున్ ఓ సినిమాకి దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అర్జున్ ఇంట శుభకార్యం జరగనుంది. తన గారాలపట్టీ ఐశ్వర్య త్వరలో ఒక ఇంటి కోడలు కాబోతోంది. అర్జున్ కుమార్తె ఐశ్వర్య త్వరలో పెళ్లి చేసుకోబోతున్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. అయితే ఈ శుభవార్తను వెల్లడించేందుకు అర్జున్ సరైన మంచి సమయం కోసం ఎదురుచూస్తున్నాడని సమాచారం. జాతీయ అవార్డు గ్రహీత హాస్యనటుడు తంబి రామయ్య కుమారుడు నటుడు ఉమాపతి రామయ్యను ఐశ్వర్య వివాహం చేసుకోవాలని భావిస్తున్నారు. ఐశ్వర్య అర్జున్ – ఉమాపతి రామయ్య చాలా కాలంగా ప్రేమలో ఉన్నారని తెలుస్తోంది. చివరగా వారి తల్లిదండ్రుల పూర్తి సంతోషం కోసం ఇద్దరూ పెళ్లితో ఒకటవ్వాలని నిర్ణయించుకున్నారు. ఇరు కుటుంబాలు ఈ జంట కలయిక కోసం ఎదురు చూస్తున్నాయి.

# అలియాభట్ ని హాలీవుడ్ మేకర్స్ ఇబ్బంది పెట్టారా?

బాలీవుడ్ బ్యూటీ అలియాభట్ ని హాలీవుడ్ మేకర్స్ ఇబ్బంది పెట్టారా? ఒకేపని పదే పదే చేయించారా? పర్ఫెక్షన్ లోపంతోనే ఇలా జరిగిందా? అంటే అవుననే తెలుస్తోంది. అలియాభట్ హార్ట్ ఆఫ్ స్టోన్ తో హాలీవుడ్ లో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం అలియా ఎంతగా శ్రమించిందో తెలిసిందే. ఏప్రిల్ లో రణబీర్ కపూర్ తో వివాహం తర్వాత జూన్ లో అలియాభట్ గర్వం దాల్చిన సంగతి తెలిసిందే. అయినా సరే అలియాభట్ సాహసోపేతమైన నిర్ణయంతో ముందుకు కదిలింది. గర్భంతోనే ఆ సినిమా షూటింగ్ లో పాల్గొంది. అందులోనూ భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణలో పాల్గొనడం విశేషం. అలాంటి సమయంలో రిస్కీ సన్నివేశాలు చేయడం ప్రమాదరకరమని తెలిసినా అలియాన వెనక్కి జక్కకుండా షూట్ ని పూర్తిచేసింది. హాలీవుడ్ ఛాన్స్ వదులుకోవడం ఇష్టం లేకనే కష్టమైనా పనిచేసినట్లు తెలిపింది. అయితే షూట్ సమయంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకునే చేసింది. టీమ్ ముందుగానే సెట్స్ లో అన్ని రకాల ఏర్పాట్లు చేసి పెట్టేవారు. స్పాట్ లో డాక్టర్లు..అంబులెన్స్‌లు..ఎమెర్జెన్సీ పరిస్థితులు వస్తే స్పందించేలా అన్ని రకాల ఏర్పాట్లు చేసారు. అలా విజయవంతంగా అలియా భట్ యాక్షన్ పార్టు షూట్ పూర్తిచేసింది. అయితే ఇదంతా ఇప్పటివరకూ ఉన్న అప్‌డేట్ . ఆతర్వాత అలియాభట్ నెలలు నిండిన సమయంలోనూ షూటింగ్ లో పాల్గొంది అన్న విషయంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.



# రికార్డ్ స్థాయిలో క్రెడిట్ కార్డ్ బకాయిలు




దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగింది. ఒకప్పుడు కేవలం ధనికులు మాత్రమే వినియోగించిన క్రెడిట్ కార్డులను ఇప్పుడు అన్ని ఆదాయ వర్గాలు వినియోగిస్తున్నారు. క్రెడిట్ కార్డుల వినియోగం పెరగడంతో బకాయిలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో క్రెడిట్ కార్డుల బకాయిలు కొత్త రికార్డ్ నెలకొల్పాయి. బ్యాంక్‌లకు వినియోదారులు చెయాల్సిన చెల్లింపుల మొత్తం మొదటిసారి 2 లక్షల కోట్లు దాటింది. గత సంవత్సరం ఏప్రిల్‌తో పోల్చితే 30 శాతం ఇవి పెరిగాయి. ఎలాంటి హామీ లేకుండా ఇస్తున్న అన్‌సెక్యూర్డ్ లోన్స్ పెరగడం పట్ల ఆర్బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు క్రెడిట్‌కార్డుల బకాయిలు కూడా భారీ స్థాయికి చేరుకున్నాయి. ఈ బకాయిల పట్ల ఆందోళన చెందాల్సిన అవసరంలేదని బ్యాంక్‌లు చెబుతున్నాయి. సాధారణంగా క్రెడిట్ కార్డు జారీ చేసే సమయంలో వినియోగదారుడి క్రెడిట్ హిస్టరీతో పాటు, ఆ వ్యక్తి ఆర్థిక స్థోమతను కూడా పరిశీలించిన తరువాతే క్రెడిట్ కార్డు జారీ చేస్తుంటామని బ్యాంక్‌లు తెలిపాయి. క్రెడిట్ కార్డులు పెరడంతోనే బకాయిలు పెరిగాయని, దీనికి ద్రవ్యోల్బణం కూడా ఒక కారణమని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం పెరిగినప్పటికీ, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే మన దేశంలో పెరిగిన సంఖ్య చాలా తక్కువగానే ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశంలో కేవలం 5 శాతం మంది దగ్గరే క్రెడిట్ కార్డులు ఉన్నాయని ఆర్బీఐ వివరాలు తెలుపుతున్నాయి. బ్యాంక్‌లు ఇచ్చిన మొత్తం రుణాల్లో క్రెడిట్ కార్డుల వాటా 1.4 శాతం మాత్రమే. చాలా తక్కువ కార్డులకే రెండు లక్షలకుపైగా పరిమితి ఉంటుంది. చాలా కార్డులకు 50వేల లోపుగానే క్రెడిట్ పరిమితి ఉంటున్నదని బ్యాంకింగ్ నిపుణుల చెబుతున్నారు. బ్యాంక్‌లు ఇచ్చిన రుణాల్లో హౌసింగ్ రుణాల వాటా 14.1 శఖరీతం, వాహన రుణాలు 3.7 శాతం ఉన్నాయి. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో క్రెడిట్ కార్డులను ఉపయోగించి 1.3 లక్షల కోట్ల విలువైన చెల్లింపులు జరిగినట్లు ఆర్బీఐ తెలిపింది. ఎలాంటి హామీ లేకుండా ఇస్తున్న అన్‌సెక్యూర్డ్ లోన్స్ పెరగడం పట్ల ఆర్బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు క్రెడిట్‌కార్డుల బకాయిలు కూడా భారీ స్థాయికి చేరుకున్నాయి.

ఈ బకాయిల పట్ల ఆందోళన చెందాల్సిన అవసరంలేదని బ్యాంక్‌లు చెబుతున్నాయి. సాధారణంగా క్రెడిట్ కార్డు జారీ చేసే సమయంలో వినియోగదారుడి క్రెడిట్ హిస్టరీతో పాటు, ఆ వ్యక్తి ఆర్థిక స్థోమతను కూడా పరిశీలించిన తరువాతే క్రెడిట్ కార్డు జారీ చేస్తుంటామని బ్యాంక్‌లు తెలిపాయి. క్రెడిట్ కార్డులు పెరడంతోనే బకాయిలు పెరిగాయని, దీనికి ద్రవ్యోల్బణం కూడా ఒక కారణమని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# దేశంలో ఇక బుల్లెట్ ట్రైన్స్ పరుగులు



**న్యూఢిల్లీ :** టెక్నాలజీ రంగంలో భారత్ మరో ముందడుగు వేసింది. హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్స్‌కు సంబంధించిన ప్రాజెక్ట్ పై హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్(ఎన్‌హెచ్‌ఆర్ఎస్‌సీఎల్) అగ్రిమెంట్ కుదుర్చుకుంది. 24 వేలకోట్లతో ప్రారంభించే అతి పెద్ద ప్రాజెక్ట్ ఇది. ఎల్ అండ్ టీ కంపెనీ ఈ కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. మెదటగా ముంబై నుంచి అహ్మదాబాద్ మధ్య ఆరు రైళ్లను నడపనున్నారు. గుజరాత్‌లో ఎన్‌హెచ్‌ఆర్ఎస్‌సీఎల్ 325 కి.మీ. సంబంధించిన భూమి, ప్రాజెక్ట్ వివరాలను ఎల్ అండ్ టీ కి అప్పజెప్పింది. అయితే గుజరాత్ వైపు ఈ ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాత మహారాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు భూమిని సమకూర్చాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ కేవలం జపాన్ టెక్నాలజీని ఇంప్లిమెంట్ చేయడమే కాకుండా..అన్ని ప్రాంతాల అభివృద్ధికి తోడ్పడుతుందని జపాన్ అంబాసిటర్ సంతోష్ సుజుకీ అభిప్రాయపడ్డారు. రైల్వే బోర్డు సీఈఓ, చైర్మన్ వి.కే యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాత మరో ఏడు మార్గాలలో ఇలాంటి ప్రాజెక్ట్ ప్రారంభిస్తాం అన్నారు. ఇలాంటి ప్రాజెక్ట్‌ల వల్ల టెక్నాలజీని అందిపుచ్చుకోవడమే కాకుండా ఉద్యోగ కల్పన జరుగుతుంది అన్నారు. ఇంజనీర్స్, టెక్నీషియనన్స్, డిజైనర్ లాంటి స్కిల్ కలిగిన వారికి మాత్రమే కాక, నిర్మాణ కార్మికుల కు, సెమీ స్కిల్ వర్కరర్స్‌కు పని దొరుకుతుందని పేర్కొన్నారు.

# ఆల్‌టైమ్ హైకి చేరిన సూచీలు..!



## రూ.3లక్షల కోట్లకుపైగా లాభపడ్డ ఇన్వెస్టర్లు..!

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం సరికొత్తగా ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరుకున్నాయి. బీఎస్ఈ సెనెక్స్ 64వేల మార్క్‌ను దాటగా.. ఎన్ఎస్ఈ నిఫ్టీ 19వేల మార్క్‌ను అందుకున్నది. చివరకు అమ్మకాల ఒత్తిడితో కాస్త తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల పవనాలు, హెచ్‌డీఎఫ్‌సీ విలీన అమలు ప్రకటన నేపథ్యంలో సూచీలు జీవనకాలంలో గరిష్ఠానికి చేరుకునేందుకు దోహదపడ్డాయి. దాంతో పాటు మార్కెట్‌లో మెటల్, ఫార్మారంగ షేర్లు సైతం మద్దతిచ్చాయి. ఇవాళ ఉదయం సెన్సెక్స్ 63,701 పాయింట్ల వద్ద ట్రేడింగ్ మొదలైంది. మధ్యాహ్నం వరకు 64వేల మార్క్‌ను చేరుకుంది. ఇంట్రాడేలో గరిష్ఠంగా 64,050.44 పాయింట్లను తాకింది. చివరకు 499.39 పాయింట్ల లాభంతో 63,915.42 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఉదయం లాభాల్లో మొదలైంది.

# శాటిలైట్ ఇంటర్నెట్.. విదేశీ సంస్థలకు వేలానికే జియో పట్టు.. ఇతర టెలికం సంస్థలు 'ససేమిరా'......!



టెస్లా సీఈఓ ఎలన్‌మస్క్ మాత్రం భారత్‌లో తన శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ 'స్టార్‌లింక్' సేవలను ప్రారంభించడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నట్లు చెప్పారు.

తమ స్టార్ లింక్ సాయంతో మౌలిక వసతులు అంతగా లేని మారుమూల ప్రాంతాలకు కూడా ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తేవచ్చునని ఎలన్ మస్క్ పేర్కొన్నారు. రెండేండ్ల క్రితం భారత్‌లో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలు ప్రారంభించడానికి స్టార్ లింక్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలందించడానికి స్పెక్ట్రం, ఎయిర్‌వేవ్‌లకు లైసెన్సు ఇవ్వాలని స్టార్ లింక్ కోరుతున్నది. స్టార్‌లింక్‌తోపాటు టాటా, భారతీ ఎయిర్ టెల్ ఆధ్వర్యంలోని వన్‌వెబ్, ఎల్ అండ్ టీ, అమెజాన్‌కు చెందిన క్యూపర్ కూడా లైసెన్స్ ఇస్తే చాలునని, వేలం వద్దని అంటున్నాయి. కానీ భారత్‌లో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ముందుకొచ్చే విదేశీ సంస్థలకు స్పెక్ట్రం, ఎయిర్ వేవ్‌ల కేటాయింపుపై వేలం నిర్వహించాలని ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ కోరుతున్నది. మొబైల్ స్పెక్ట్రం తరహాలోనే శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలకు వినియోగించే ఎల్ బ్యాండ్, ఎస్ బ్యాండ్ వేలం నిర్వహించాలన్న ప్రతిపాదనపై రిలయన్స్ జియోకు వొడాఫోన్ ఐడియా మద్దతు పలికింది. స్టార్‌లింక్, భారతీ ఎయిర్‌టెల్ వన్‌వెబ్, అమెజాన్ క్యూపర్ ప్రతిపాదనలకు భిన్నంగా టెలికం రంగ నిపుణులు స్పందిస్తున్నారు. భారత్‌లో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలకు స్పెక్ట్రం వేలం ద్వారానే అనుమతి ఇవ్వడం మంచిదని వారంటున్నారు. దేశంలోకి విదేశీ సంస్థల పెట్టుబడులు రావాలంటే శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలకు వేలం నిర్వహించడమే సరైందని భావిస్తున్నట్లు కేంద్ర టెలికం విభాగం ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. దీనివల్ల ఓటీటీ ప్లాట్ ఫామ్స్ నుంచి ప్రసారమయ్యే కంటెంట్ మీద కొంత నియంత్రణ ఉంటుందని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే భారత్‌లో ఎయిర్ టెల్ వన్ వెబ్ ఇండియా, జియో శాటిలైట్ కమ్యూనికేషన్ సంస్థలకు టెలికం శాఖ అనుమతులు ఇచ్చేసినా.. ఇంకా కేంద్రం విధి విధానాలు ఖరారు చేయలేదు. ఈ పరిస్థితుల్లో భారత్‌లో తమ సేవలు ప్రారంభించాలని భావిస్తున్న విదేశీ సంస్థలు వేలానికి బదులు లైసెన్సులు జారీ చేయాలని కోరుతున్నాయి.

# భారీ లాభాలపై అదానీ గురి..




డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ భారీ లాభాలపై గురి పెట్టింది. రానున్న రెండు, మూడేళ్లలో రూ. 90,000 కోట్ల నిర్వహణ లాభాల(ఇబిటా)ను అందుకోవాలని ఆశిస్తోంది. ఇందుకు విమానాశ్రయాలుసహా.. సిమెంట్, పునరుత్పాదక ఇంధనం తదితర పలు బిజినెస్‌లను పటిష్ట వృద్ధి బాటలో నిలపాలని ప్రణాళికలు వేస్తున్నట్లు అదానీ గ్రూప్ తెలియజేసింది. గ్రూప్ నిర్వహణలోగల పోర్టులు, రవాణా, లాజిస్టిక్స్, విద్యుత్ ప్రసారం, సోలార్ ప్యానెళ్లు తదితర విభాగాలను పరుగు తీయించే యోచనలో ఉంది. ఈ బాటలో గ్రూప్ చేపడుతున్న మౌలిక సదుపాయాల కొత్త పెట్టుబడులు రానున్న కాలంలో నగదును సృష్టించగలదని అంచనా వేస్తోంది. యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో అదానీ గ్రూప్ ఈ నెల మొదట్లో 2.65 బిలియన్ డాలర్ల విలువైన రుణాలను తిరిగి చెల్లించిన సంగతి తెలిసిందే.

# కనీస పెట్టుబడి.. బెనిఫిట్లకు బెస్ట్ ఎల్ఐసీ న్యూ ఎండోమెంట్ ప్లస్.. ఇవీ డిటైల్స్




భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) తన కస్టమర్ల కోసం యూనిట్ లింక్డ్, రెగ్యులర్ ప్రీమియం, నాన్-పార్టిసిపేటింగ్ ఇన్సూరెన్స్ ప్లాన్ 'ఎల్ఐసీ న్యూ ఎండోమెంట్ ప్లస్' ప్లాన్ తీసుకొచ్చింది. ఈ ప్లాన్‌తో పాలసీదారుకు డబుల్ బెనిఫిట్లు ఉన్నాయి. మనీ పొదుపు చేయడంతోపాటు ఇన్సూరెన్స్ కవరేజీ కూడా ఉంటుంది. పాలసీదారు దీర్ఘకాలిక పొదుపుతోపాటు గుడ్ కాంబినేషన్ ఆఫ్ సెక్యూరిటీ అందించడానికి ఈ ప్లాన్ తీసుకొచ్చింది. ఈ ప్లాన్ కింద పాలసీదారుడికి నాలుగు ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ ఉన్నాయి. బాండ్ ఫండ్, సెక్యూర్డ్ ఫండ్, బ్యాలెన్స్‌డ్ ఫండ్, గ్రోత్ ఫండ్ ఆప్షన్లు ఉన్నాయి. ఈ పాలసీ కింద ఏడాది, అర్ధ సంవత్సరం, త్రైమాసికం, నెలవారీ ప్రీమియం పేమెంట్స్ ఉన్నాయి. ఈ పాలసీ ప్రీమియం చెల్లింపులు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే సాగుతాయి. నెలవారీ ప్రీమియం చెల్లింపులకు15 రోజులు, త్రైమాసిక, అర్ధ సంవత్సర, ఏడాది ప్రీమియం చెల్లింపులకు గడువు తేదీ నుంచి 30 రోజుల గ్రేస్ పీరియడ్ ఉంటుంది. 90 రోజుల పసికందు నుంచి 50 ఏండ్ల వ్యక్తుల పేరిట ఈ పాలసీ కొనుగోలు చేయొచ్చు. పాలసీ మెచ్యూరిటీకి కనీసం 18 ఏండ్లు, గరిష్టంగా 60 ఏండ్ల గడువు ఉంటుంది. పాలసీదారు 10 ఏండ్లు లేదా 20 ఏండ్ల టర్మ్ ఎంచుకోవచ్చు. రెండు టర్మ్ పాలసీలకు ప్రీమియం ఒకేలా ఉంటుంది. కనీస ప్రీమియం రూ.3000 నుంచి రూ.20000 వరకు ఉంటుంది. వార్షిక ప్రీమియం చెల్లింపులపై పది రెట్లు రిటర్న్ లభిస్తాయి. పాలసీదారు అనూహ్య మరణానికి గురైతే నామినీకి మొత్తం ఫండ్ విలువ చెల్లిస్తారు. రిస్క్ కమెన్స్‌మెంట్ డేట్ తర్వాత మరణిస్తే, మొత్తం ప్రీమియంపై 105 శాతం, వార్షిక ప్రీమియంపై 10 రెట్లు, మొత్తం పాలసీ ఫండ్ విలువల్లో గరిష్టం చెల్లిస్తారు. పాలసీదారుడికి కనీసం ఐదేండ్ల గడువు ఉంటే యాక్సిడెంటల్ డెత్ బెనిఫిట్ రైడర్ ఎంచుకోవచ్చు. అది పాలసీ మెచ్యూరిటీ తేదీ వచ్చే వరకూ కొనసాగుతుంది. ఐదేండ్ల తర్వాత పాలసీదారు అన్ని ప్రీమియంలు చెల్లించినట్లైతే మొత్తం మనీ విత్ డ్రా చేసుకోవచ్చు. పాలసీ పీరియడ్ కాలంలో సంబంధిత పాలసీదారు పలు ఫండ్ ఆప్షన్లు మార్చుకోవచ్చు. ఒక ఫండ్ నుంచి మరో ఫండ్‌కు ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు.

# తెలంగాణ అధ్యక్షుడిగా కిషన్ రెడ్డి?



## మార్పు జరుగుతుందా?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):**

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడి మార్పుపై మరోసారి జోరుగా చర్చజరుగుతోంది. బండి సంజయ్ కి కేంద్రంలో కీలక పదవి ఇచ్చి రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్ రెడ్డికి బాధ్యతలు ఇప్పగిస్తారని సమాచారం. తెలంగాణ బీజేపీలో అంతర్గత కుమ్ములాటలకు చెక్ పెట్టేందుకు హైకమాండ్ ప్రయత్నిస్తుంది. ఈ సమయంలో రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ ను మార్చబోతున్నారని మళ్లీ ప్రచారం జోరందుకుంది. బండి సంజయ్ స్థానంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేరు వినిపిస్తుంది. ఇవాళ మీడియా సమావేశం ఏర్పాటుచేస్తున్న కిషన్ రెడ్డి ఈ విషయంపై స్పష్టత ఇస్తారని పలువురు నేతలు అంటున్నారు. కిషన్ రెడ్డికి తెలంగాణ బీజేపీ బాధ్యతలు అప్పగించి, బండి సంజయ్ కు కేంద్ర మంత్రిగా అవకాశం ఇస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది.

బండి సంజయ్ ప్రస్తుతం దిల్లీలోనే ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ అగ్రనేతలతో హైకమాండ్ గత రెండు రోజులుగా చర్చలు జరుపుతోంది. ఈటల, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలతో జేపీ నడ్డా, అమిత్ షా చర్చలు జరుపుతున్నారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి మార్పుపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అని పార్టీలో చర్చ జరుగుతోంది. కిషన్ రెడ్డి సారథ్యంలో కొత్త టీమ్ ఏర్పాటుకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో లేదో వేచి చూడాలి. తెలంగాణ బీజేపీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డికి తెలంగాణ బీజేపీ బాధ్యతలు అప్పగించేందుకు హైకమాండ్ మొగ్గుచూపుతోందని సమాచారం. ఈటల రాజేందర్‌కు కూడా కీలక పదవిని కట్టబెట్టబోతున్నారని ప్రచారం జరుగుతోంది. వారంలోగా పార్టీలో మార్పులు జరగనున్నాయని బీజేపీ వర్గాలు అంటున్నాయి. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ను ఆ పార్టీ అధిష్ఠానం మార్చుతుందని గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588